RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ 08 జూలై 2026 బుధవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:34

## నాచారంలో బాలామృతం నూతన ప్లాంట్

## ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

### కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

### మహిళల సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

### గర్భిణుల పోషణకు మరింత బలం



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూలై 7:మహిళల ఆర్థిక సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 2034 నాటికి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. నాచారంలోని తెలంగాణ ఫుడ్స్‌లో ఏర్పాటు చేసిన బాలామృతం నూతన ప్లాంట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఉత్పత్తి, ప్యాకింగ్ ప్రక్రియలను పరిశీలించారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రారంభమైన బాలామృతం కార్యక్రమం నేడు పరిశ్రమ స్థాయికి ఎదిగిందన్నారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. రెండు కోట్లకు పైగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరుతో మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు.




మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా వెయ్యి బస్సులకు మహిళలను యజమానులుగా చేశామని, వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును మహిళా సంఘాలకు అప్పగించామని వెల్లడించారు. ఆడబిడ్డలు, గర్భిణుల ఆరోగ్య పరిరక్షణ కోసం బాలామృతం నూతన ప్లాంట్‌ను ప్రారంభించామని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని అమలు చేస్తున్నామని, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. విద్య, ఆరోగ్య రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్, తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ ఫహీమ్, టీఎస్ఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చరిత్ర సృష్టించిన మోదీ..

### పార్లమెంట్‌లో ప్రసంగించిన తొలి భారత ప్రధాని



భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఇండోనేషియా పర్యటనలో చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించారు. జకార్తాలో మంగళవారం ఇండోనేషియా పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన తొలి భారత ప్రధానిగా ఆయన సరికొత్త రికార్డు సృష్టించారు. ఇరు దేశాల మధ్య ఉన్న నాగరికత, చారిత్రక వారసత్వ సంబంధాలను గుర్తుచేస్తూ, ప్రాంతీయ స్థిరత్వం కోసం ఉమ్మడిగా కృషి చేయాల్సిన ఆవశ్యకతను ఆయన తన ప్రసంగంలో నొక్కిచెప్పారు.

భారత్, ఇండోనేషియాలను సముద్రాలు వేరుచేయడం లేదని, చరిత్ర, సంస్కృతి, ప్రజాస్వామ్య విలువలనే వారధులు రెండు దేశాలను అనుసంధానం చేస్తున్నాయని మోదీ పేర్కొన్నారు. రామాయణ, మహాభారత కాలం నుంచి ఇరు దేశాల మధ్య దృఢమైన సాంస్కృతిక బంధం ఉందని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా తమకు ఘన స్వాగతం పలికిన ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోకు, పార్లమెంట్‌లో ప్రసంగించే అరుదైన అవకాశం కల్పించిన స్పీకర్‌కు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు.

ఈ పర్యటనలో భాగంగా ఇండోనేషియా ఎన్నికల వ్యవస్థ ఆధునికీకరణకు భారత్ పూర్తి సహకారం అందిస్తుందని ప్రధాని హామీ ఇచ్చారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) అభివృద్ధిలో తోడ్పాటునందిస్తామని, అదేవిధంగా ఇండోనేషియాలో ఐఐఎం బెంగళూరు క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు.

భారత ప్రభుత్వ పథకాలను తమ దేశంలోనూ అమలు చేస్తామని గతంలో ఇండోనేషియా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "మిత్రుల మధ్య కాపీరైట్లు ఉండవు" అని మోదీ చమత్కరించడంతో సభలో నవ్వులు విరిశాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న సుహృద్భావ వాతావరణానికి ఈ వ్యాఖ్య అద్దం పట్టింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం రెండు దేశాల మధ్య సహకారం అత్యంత కీలకమని ప్రధాని ఉద్ఘాటించారు. జూలై 6 నుంచి 11 వరకు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ప్రధాని మోదీ పర్యటిస్తున్నారు.

## ఏఐ రంగంలో ప్రపంచానికి దిక్సూచిగా తెలంగాణ

### బాధ్యతాయుతమైన సాంకేతికతకు కేరాఫ్ అడ్రస్‌గా హైదరాబాద్''?

కృత్రిమ మేధస్సు (ఏఐ) రంగంలో ప్రపంచ దేశాలకు తెలంగాణ సరికొత్త దిశానిర్దేశం చేస్తోంది. కేవలం పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ మరియు సామాజిక ప్రయోజనాలను జోడించి 'ఏఐ ప్రమాణాలకు దిక్సూచి'గా తెలంగాణ నిలుస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. హైదరాబాద్‌లోని హెచ్.ఐ.సి.సి (ఊఎఅఅ) వేదికగా జరిగిన 'గ్రీన్ గ్రోత్ ఎకానమిక్ సమ్మిట్ - ది హైదరాబాద్ కలెక్టివ్' కార్యక్రమాన్ని, పరిశ్రమలు మరియు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. 'ది మెరీడియన్ కలెక్టివ్' ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈ సమ్మిట్ జరగనుంది.

మిగతా 2లో



## ఈటెల పై మహేష్ కుమార్ గౌడ్ ఫైర్...

ఈటల రాజేందర్ మాట్లాడుతుంటే ఆయన బీజేపీ నేతలా మాట్లాడుతున్నారో, లేక బీఆర్ఎస్ ఏజెంట్‌లా మాట్లాడుతున్నారో ప్రజలకే అర్థం కావడం లేదు.కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీళ్లు తీయొద్దని చెప్పింది ఎవరో కాదు... కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎన్‌డీఎస్‌ఏ (చీణూూ - నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ). కేటీఆర్ గారు టెక్నికల్ ఎక్స్‌పర్ట్ కాదు... అసలైన ఎక్స్‌పర్ట్స్ ఎన్‌డీఎస్‌ఏ వాళ్లే.అక్కడ భద్రతా కారణాల దృష్ట్యా నీళ్లు విడుదల చేయొద్దని నిషేధించింది కేంద్ర ప్రభుత్వ సంస్థే.ఈటల రాజేందర్ ఢిల్లీకి పోయి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని అడిగి రావాలి.

ఈ రెండు నాలుకల ధోరణి ఏంటి?

ఆయన మాటల్లో బీజేపీ లైన్ ఉందా, బీఆర్ఎస్ స్క్రిప్ట్ ఉందా అనేది తెలంగాణ సమాజం గమనిస్తోంది.బీఆర్ఎస్, బీజేపీలు రెండూ ఒకటే అని మేము మొదటి నుంచి చెప్తూనే ఉన్నాం. ఇప్పుడు అది వంద శాతం నిజమని తేలిపోయింది.

ఢిల్లీలో దోస్తీ... గల్లీలో కుస్తీ అన్నట్టుంది వీరి వ్యవహారం. ప్రజా క్షేత్రంలో బీజేపీ, బీఆర్ఎస్ ఆడుతున్న ఈ కపట నాటకాలను కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజల ముందు ఖచ్చితంగా ఎండగడుతుంది.

## ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం

### రూ.360 కోట్లతో రెవెన్యూ శాశ్వత భవనాలు

### 10 ఆర్డీవో,107 తహశీల్దార్, 53 సబ్ రిజిస్ట్రార్ భవనాల నిర్మాణం

### -- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్: రాష్ట్రంలో రెవెన్యూ పరిపాలనను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు ఆధునిక, గౌరవప్రదమైన సేవలు అందించాలనే లక్ష్యంతో దశలవారీగా తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణాన్ని ప్రభుత్వం వేగవంతం చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార డ పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.

భవనాల నిర్మాణాలపై మంగళవారం నాడు అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలివిడతలో అద్దె భవనాలు, శిథిలావస్థలో ఉన్న 107 తహసీల్దార్ కార్యాలయాలు, 10 ఆర్డీవో కార్యాలయాలకు 263 కోట్ల రూపాయిలతో అలాగే స్టాంప్స్ డ రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి రూ.97 కోట్ల రూపాయిలతో 48 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో డీఐజీ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మొత్తం భవనాల కోసం రెండు విభాగాలకు సంబంధించి 360 కోట్ల రూపాయిలతో పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సౌకర్యాలతో నిర్మించి ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేలా రూపొందిస్తామని చెప్పారు. వీటి నిర్మాణ బాధ్యతను తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

హౌసింగ్ అధికారులు జిల్లా స్థాయిలో రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని కొత్త భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించి నిర్మాణ పనులను వేగంగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సేవలందించే కార్యాలయాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మించబడతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు.

ఇప్పటికే ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 13 క్లస్టర్‌లుగా విభజించి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నామని ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఐదు సంవత్సరాల నిర్వహణా బాధ్యతను కూడా ఆ సంస్థలే తీసుకున్నాయని ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలకు శంకుస్థాపన చేయగా నిర్మాణపనులు చురుగ్గా సాగుతున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు.

ప్రజాబలం

08 జూలై 2026 బుధవారం

# త్వరలో గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్

భారతీయులకు బంగారంపై ఉన్న మక్కువ, సెంటిమెంట్ ప్రపంచంలో మరెక్కడా కనిపించదు. శుభకార్యం ఏదైనా, పండగ ఏదైనా సెంటిమెంట్‌గా కొనే పసిడి.. కాలక్రమేణా ఇళ్లలోని లాకర్లలోనో, బ్యాంకు బీరువాల్లోనో నిరుపయోగంగా ఉండిపోతుంది. దేశ ఆర్థిక చిత్రం పరంగా చూస్తే, ఈ నిర్ణయం అత్యంత కీలకం కానుంది. భారతదేశం ప్రతి ఏటా వందల టన్నుల బంగారాన్ని విదేశాల నుండి దిగుమతి చేసుకోవడం వల్ల భారీగా విదేశీ మారక ద్రవ్యం బయటకు వెళ్ళిపోతూ కరెంట్ అకౌంట్ డెఫిసిట్ పై ఒత్తిడి పెరుగుతోంది. మన దేశ సరిహద్దుల్లోనే ఇళ్లల్లో ఉన్న 30,000 టన్నుల బంగారంలో కేవలం 5 నుండి 10 శాతం భాగాన్ని చలామణిలోకి తీసుకురాగలిగినా.. రాబోయే ఐదేళ్లలో బంగారం దిగుమతులపై భారం సగానికి పైగా తగ్గుతుంది. ఇది అంతర్జాతీయ మార్కెట్లో భారత రూపాయి విలువను మరింత బలోపేతం చేయడానికి ఎంతో దోహదపడుతుంది.అంతర్జాతీయ మార్కెట్ నివేదికల ప్రకారం.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా భారతీయ కుటుంబాల వద్ద సుమారు 30,000 టన్నుల గృహ వినియోగ బంగారం నిద్రాణంగా ఉంది. అంతర్జాతీయంగా పసిడి ధరలు ఆకాశాన్ని తాకుతున్న ఈ తరుణంలో.. ఈ భారీ సంపదను దేశ ఆర్థిక వ్యవస్థలోకి తీసుకురావడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఒక విప్లవాత్మకమైన సరికొత్త ప్రణాళికను సిద్ధం చేస్తోంది. పెరిగిపోతున్న పసిడి ధరలు దేశ దిగుమతి బిల్లుపై , రూపాయి విలువపై తీవ్ర ప్రభావం చూపుతున్న సమయంలో, పాత గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్ కు కీలక మార్పులు చేస్తూ కేంద్రం ఈ కొత్త సంస్కరణను తీసుకురాబోతోంది.ఈ పునరుద్ధరించిన కొత్త విధానాన్ని రాబోయే ఆగస్టు నాటికి దేశవ్యాప్తంగా అమల్లోకి తెచ్చేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కసరత్తు చేస్తోంది. నిజానికి, గతంలో 2015లోనే నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ గోల్డ్ మానిటైజేషన్ పథకాన్ని ప్రవేశపెట్టినప్పటికీ, అది ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేకపోయింది. నాటి నుండి ఇప్పటివరకు దశాబ్ద కాలంలో కేవలం 39 టన్నుల బంగారాన్ని మాత్రమే ప్రభుత్వం ఈ పథకం కింద సేకరించగలిగింది. కఠినమైన బ్యాంకింగ్ నిబంధనలు, బంగారాన్ని కరిగించడానికి కస్టమర్లకు ఉండే సెంటిమెంట్ అడ్డంకులు, ప్యూరిటీ వెరిఫికేషన్ సెంటర్ల కొరత , అవగాహన లోపం దీనికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. అందుకే ఈసారి సాంప్రదాయ బ్యాంకులపైనే కాకుండా, ఏకంగా జువెలర్స్ నే నేరుగా రంగంలోకి దించాలని కేంద్రం డిసైడ్ అయింది. ఈ కొత్త పాలసీలోని అత్యంత కీలకమైన మార్పు ఏంటంటే.. ఇకపై సామాన్య ప్రజలు తమ వద్ద ఉన్న నిరుపయోగ బంగారాన్ని డిపాజిట్ చేయడానికి బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. తాము క్రమం తప్పకుండా వెళ్లే, నమ్మకమైన స్థానిక జువెల వద్దకే నేరుగా వెళ్లవచ్చు.బంగారం వ్యాపారులే నేరుగా కస్టమర్ల నుంచి ఈ పసిడి డిపాజిట్లను సేకరించి, వాటిని ఒకచోట చేర్చే బాధ్యతను తీసుకుంటారు. తరతరాలుగా స్థానిక వ్యాపారులతో భారతీయ కుటుంబాలకు ఉండే సత్సంబంధాలను, నమ్మకాన్ని వాడుకోవడం ద్వారా ఈ స్కీమ్‌ను విజయవంతం చేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. జువెలర్లను కలెక్షన్ అండ్ ప్యూరిటీ టెస్టింగ్ సెంటర్లు గా గుర్తించడం ద్వారా మౌలిక సదుపాయాల కొరతను అధిగమించవచ్చు. ఈ సరికొత్త వ్యూహం వల్ల అటు ప్రభుత్వానికి, ఇటు జువెలర్లకు , సామాన్య వినియోగదారులకు ముగ్గురికీ లాభం చేకూరనుంది . దేశీయంగానే పాత బంగారం రీసైక్లింగ్ ద్వారా అందుబాటులోకి రావడం వల్ల జువెలర్లకు విదేశాల నుంచి కొత్త బంగారాన్ని దిగుమతి చేసుకునే సోర్సింగ్ ఖర్చులు , ప్రీమియంలు భారీగా తగ్గుతాయి. ఫలితంగా దేశీయ మార్కెట్లో బంగారం కొరత తగ్గుతుంది. మరోవైపు, ఇళ్లలో లాకర్లకే పరిమితమై ఎలాంటి ఆదాయాన్ని ఇవ్వని బంగారానికి ప్రభుత్వం బాండ్ల రూపంలో వార్షిక వడ్డీ కల్పిస్తుంది కాబట్టి, సామాన్య ప్రజలకు ఇది ఒక అద్భుతమైన అదనపు ఆదాయ వనరుగా , సురక్షితమైన పెట్టుబడిగా మారుతుంది. డిపాజిట్ గడువు ముగిసిన తర్వాత అంతే బరువు గల స్వచ్ఛమైన బంగారాన్ని లేదా నాటి మార్కెట్ ధర ప్రకారం నగదును పొందే వెసులుబాటు కూడా ఉంటుంది. రాబోయే ఆగస్టులో ప్రారంభం కానున్న ఈ సరికొత్త గోల్డ్ మానిటైజేషన్ పాలసీ పాత లోపాలను అధిగమించి ఏ మేరకు సక్సెస్ అవుతుందనేది ఇప్పుడు వ్యాపార వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. సాంప్రదాయకంగా గోల్డ్ లాకర్ సెంటిమెంట్ ను, ఆభరణాల రూపాన్ని మార్చడానికి ఇష్టపడని భారతీయ కుటుంబాలు.. ప్రభుత్వం కల్పిస్తున్న లీగల్ గ్యారెంటీని, జువెలర్ల ద్వారా లభించబోయే సులువైన డిపాజిట్ ప్రక్రియను ఏ మేరకు అందిపుచ్చుకుంటాయో వేచి చూడాలి. ఈ పథకం గనుక క్షేత్రస్థాయిలో విజయవంతమైతే.. భారత ఆర్థిక వ్యవస్థకు సరికొత్త 'పసిడి వెలుగులు' రావడం ఖాయమని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# నాలుగు లేన్ల ఆధునిక రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.





**రంగారెడ్డి ప్రజాబలం ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా రూ.338 కోట్లతో ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరం నియోజకవర్గాల్లో నాలుగు లేన్ల ఆధునిక రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన - రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.

రూ.338 కోట్ల వ్యయంతో ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరం నియోజకవర్గాల్లో హైబ్రిడ్ అన్యుటీ మోడల్ (నాూవీ) విధానంలో చేపట్టనున్న ఆధునిక నాలుగు లేన్ల రహదారుల నిర్మాణ పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు.

అ న ం త ర ం నిర్వహించిన సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తనపై ఉంచిన విశ్వాసం వల్లే రాష్ట్రంలో కీలకమైన రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా సేవ చేసే అవకాశం లభించిందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇప్పటికే రూ.85 కోట్ల విలువైన రహదారి పనులు పూర్తి చేశామని, మరో రూ.275 కోట్లతో పలు రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అదనంగా రూ.100 కోట్ల విలువైన కొత్త రహదారి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.

పార్టీలు వేర్వేరు అయినప్పటికీ అభివృద్ధి విషయంలో అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, జాతీయ రహదారుల విస్తరణ, వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రూ.338 కోట్లతో 140కు పైగా రహదారి పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాలు, బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని, ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. లక్ష్మీరెడ్డిపాలెం వద్ద ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

ఇ బ్ర హీ ం ప ట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి రూ.338 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరు కావడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఇందులో సుమారు రూ.275 కోట్ల పనులు నేరుగా ఇబ్రహీంపట్నం పరిధిలో చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో 200 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, రహదారుల విస్తరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే రూ.2,300 కోట్లతో సమీకృత మార్కెట్ ఏర్పాటు ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, భవనాల శాఖ ద్వారా భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రధాన రహదారులను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఉపాధి, పెట్టుబడులు, ప్రాంతీయ అభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (TUFIDC) చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జననేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం:మహేష్ కుమార్ గౌడ్

దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ప్రజానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ మహేష్ కుమార్ గౌడ్ నివాళి ప్రజల సంక్షేమమే ప్రభుత్వ పాలనకు కేంద్రబిందువుగా ఉండాలని ఆచరణలో చూపించిన అరుదైన నాయకుడు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని పేర్కొన్నారు.

రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ఆయన రాజకీయ తత్వమని అన్నారు. ప్రజా ప్రస్థానం పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకుని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటికి అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం వైఎస్సార్ నాయకత్వ విశిష్టత అని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# ఏఐ రంగంలో ప్రపంచానికి దిక్సూచిగా తెలంగాణ

మొదటి పేజీ తరువాయి

ఈ సమ్మిట్ కు వివిధ దేశాల నుంచి హాజరైన ప్రతినిధులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం మాట్లాడుతూ "ఏఐ అంటే కేవలం క్లౌడ్ కంప్యూటింగ్, సర్వర్లు మాత్రమే కాదని, దీని వెనుక విద్యుత్, నీరు, భూమి మరియు మానవ వనరుల భాగస్వామ్యం ఉంటుందని ప్రభుత్వం గుర్తించింది.

"మేము ఏఐ వద్దు అనడం లేదు, కానీ ఆ ఏఐ ఎలా ఉండాలో ప్రపంచానికి దిశానిర్దేశం చేస్తున్నాము" అని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రకృతి వనరులను, ముఖ్యంగా నీరు మరియు విద్యుత్తును హరిస్తూ ఏఐని నిర్మించడం కాకుండా, పునరుత్పాదక ఇంధనం మరియు బాధ్యతాయుతమైన వనరుల నిర్వహణతో తెలంగాణ ఏఐకి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.పెట్టుబడులను ఆహ్వానించడంలో తెలంగాణ దూకుడుగా ఉన్నప్పటికీ, అది పర్యావరణానికి మరియు స్థానిక ప్రజలకు మేలు చేసే విధంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. "కేవలం భూమి, నీరు, విద్యుత్ ఇచ్చి చేతులు దులుపుకునే పద్ధతి కాకుండా.. పరిశ్రమలు స్థానిక నైపుణ్యాలను పెంపొందించాలి, స్వచ్ఛమైన ఇంధనాన్ని వాడాలి, మరియు రీసైకిల్ చేసిన నీటిని మాత్రమే వినియోగించాలి. ఇది కేవలం ఇంజనీరింగ్ మెరుగుదల కాదు, ఇది మన విలువలకు నిదర్శనం" అని ఆయన పేర్కొన్నారు.ప్రపంచవ్యాప్తంగా కార్బన్ క్రెడిట్స్ గురించి చర్చిస్తున్న సమయంలో, తెలంగాణ 'పీపుల్స్ క్రెడిట్' అనే కొత్త భావనను తెరపైకి తెచ్చిందని వెల్లడించారు. ఏఐ పెట్టుబడులు కేవలం డేటా సెంటర్లకే పరిమితం కాకుండా, స్థానిక ఉపాధిని పెంపొందించడం, గ్రామీణ యువతకు నైపుణ్యాలను అందించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనివ్వాలని ప్రభుత్వం నిర్దేశిస్తుందని అన్నారు.పెట్టుబడులు రావాలి, కానీ అవి స్వచ్ఛమైన ఇంధనంతో, పారదర్శకతతో, ప్రజల పట్ల గౌరవంతో రావాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కంపెనీలు కేవలం ఉద్గారాలను తగ్గించడమే కాకుండా, స్థానిక మేధో సంపత్తిని మెరుగుపరిచే బాధ్యత తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.?రైతులకు, సామాన్యులకు భరోసా: వ్యవసాయానికి, సామాన్యులకు దక్కాల్సిన నీటితో సాంకేతికత ఎప్పుడూ పోటీ పడకూడదని భట్టి విక్రమార్క నొక్కి చెప్పారు. నీటి వినియోగంలో అత్యంత బాధ్యతాయుతమైన విధానాలను అనుసరిస్తున్న ఏఐ వ్యవస్థలకే తెలంగాణ ప్రాధాన్యత ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.?ఏఐ సామాన్య ప్రజలకు కూడా అందుబాటులో ఉండాలని, భాషా అడ్డంకులను తొలగించి, మహబూబాబాద్ నుంచి ఆదిలాబాద్ వరకు ఉన్న గ్రామీణ యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన ప్రకటించారు.నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు దేశం అనుసరించిన శాస్త్ర, సాంకేతిక వృద్ధి పథాన్ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మరింత ముందుకు తీసుకెళ్తోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తెలంగాణ అంటే కేవలం డేటా సెంటర్ల కేంద్రం మాత్రమే కాదు, ఆ డేటా సెంటర్లు ఎలా నిర్మించాలో ప్రపంచానికి నేర్పే 'రోల్ మోడల్' అని ఆయన గర్వంగా ప్రకటించారు.?పరిశ్రమలకు స్వాగతం పలుకుతూనే, 'ప్రజల పక్షపాతి'గా తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు, భవిష్యత్తులో ప్రపంచ ఏఐ ప్రమాణాలను హైదరాబాద్ నిర్ణయించే స్థాయికి తీసుకువెళ్తాయన్నారు.

పాతదానికి-కొత్తదానికి మధ్య వారధిగా ఉన్న హైదరాబాద్, నేడు 'ఏఐ బాధ్యతాయుత ప్రమాణాలకు' దిక్సూచిగా మారిందన్నారు.పరిశ్రమలకు తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న అద్భుతమైన వాతావరణం, పారదర్శకమైన పాలన, మానవీయ విలువలతో కూడిన అభివృద్ధి విధానాలు పెట్టుబడిదారులకు గొప్ప భరోసానిస్తున్నాయన్నారు. ?రాబోయే రోజుల్లో ఏఐ మేధస్సుతో పాటు, మానవీయ వివేకం కూడా కలిగిన సంస్థలే ప్రపంచాన్ని ఏలుతాయని, ఆ దిశగా తెలంగాణ అడుగులు వేస్తోందని వివరించారు.

## ఫర్టిలైజర్ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలి

రాజన్న సిరిసిల్ల ఫర్టిలైజర్ యాప్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. తంగళ్లపల్లి మండలం జిల్లెలలోని గ్రోమోర్, నేరేళ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో ఎంత యూరియా ఉంది? ఎంత వచ్చింది? ఫర్టిలైజర్ యాప్ ద్వారా రైతులు బుకింగ్ చేసుకున్న వివరాలు మొబైల్, రిజిస్టర్ లో పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో యూరియా నిల్వలను తనిఖీ చేశారు. పీఏసీఎస్ లో రైతులు యూరియా తీసుకువెళ్లేందుకు రాగా, వారితో జిల్లా కలెక్టర్ మాట్లాడారు.ఎక్కడి నుంచి వచ్చారు? ఎన్ని ఎకరాల భూమి ఉంది? ఏ ఏ పంటలు సాగు చేస్తున్నారు? ఫర్టిలైజర్ యాప్ వినియోగిస్తున్నారా? సేవలు ఎలా ఉన్నాయో వారిని అడిగి తెలుసుకున్నారు. క్యూలో నిలబడే ఇబ్బందులు దూరం అయ్యాయని, ఎప్పుడైనా తమకు నచ్చిన షాప్ లో తీసుకునే అవకాశం ఉందని రైతులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు.

# ఏబీవీపీ బషీర్బాగ్ నగర శాఖఆధ్వర్యంలో “క్లీన్ క్యాంపస్ -- గ్రీన్ క్యాంపస్”




హైద్రాబాద్ జులై 7;అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆలియా జూనియర్(బాలుర) కళాశాల ఆధ్వర్యంలో జూలై 9 జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా “క్లీన్ క్యాంపస్ -- గ్రీన్ క్యాంపస్” కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం మరియు ఇతర వ్యర్థ పదార్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. విద్యార్థుల్లో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఏబీవీపీ నాయకులు తెలిపారు.

ఈ సందర్భంగా నగర కార్యదర్శి సురేందర్ మాట్లాడుతూ, ఏబీవీపీ కేవలం విద్యార్థి సమస్యలపై ఉద్యమాలు చేసే సంస్థ మాత్రమే కాదని, సమాజ నిర్మాణంలోనూ తనదైన పాత్ర పోషిస్తున్న జాతీయ విద్యార్థి సంస్థ అని అన్నారు. ఏబీవీపీ పరివర్తనాత్మక ఆలోచనలతో విద్యార్థి క్షేత్రంలో సేవా కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ చర్యలు, సామాజిక బాధ్యతా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మమత, సింధూరి, రఘునందన్, రాంప్రసాద్, అక్షిత, మరియు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# వృద్ధులకు సామాజికంగా మద్దతు ఎంతో అవసరం- వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సా యి చౌదరి



వికారాబాద్ జులై 7 : దేశంలోనే వృద్ధులలో అత్యధికులు గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా వెనకబడిన పరిస్థితుల్లో జీవిస్తున్నారని, అంతేకాకుండా వృద్ధులు సామాజికంగా, మానసికంగా, ఒంటరితనానికి గురవుతున్నారని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి అన్నారు. నేడు డే కేర్ సెంటర్ లో జరిగిన కార్యక్రమంలో సాయి చౌదరి మాట్లాడుతూ భార్య లేదా భర్త చనిపోవడం, ఒంటరిగా జీవించటం, కొడుకులు, కోడళ్ళు లేదా కుమార్తెతో సంబంధాలు లేకపోవడం, వృద్ధాప్యంలో వేధింపులు గురికావడం వల్ల మానసిక కుశీగుబాటు, ఆందోళన పెరుగుతున్నాయని, ఒంటరితనంతో బాధపడే వృద్ధులలో గుండె జబ్బులు, తీవ్రమైన డిప్రెషన్, జ్ఞాపక శక్తి తగ్గటం, ఆత్మహత్య ఆలోచనలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని సాయి చౌదరి హెచ్చరించారు. వృద్ధులకు సామాజికంగా మద్దతు ఎంతో అవసరం అని డే కేర్ సెంటర్లలో వినోద కార్యక్రమాలను స్థానికంగా ఏర్పాటు చేయడం ద్వారా వారిని సామాజికంగా చురుగ్గా ఉండేలా చూస్తుందని, ఆరోగ్య సంరక్షణ, వృద్ధుల శారీరక ఆరోగ్యంతో పాటు, మానసిక ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ పెరుగుతుందని, ఒంటరిగా నివసించే వృద్ధులకు సామాజికంగా మద్దతు ఎంతో అవసరమని ఈ విషయంలో డే కేర్ సెంటర్ కి రావటం ద్వారా ఒకరికొకరు మానవీయంగా స్పందిస్తారని, వారితో ఆప్యాయంగా మెలుగుతారని తద్వారా సామాజిక మద్దతు ఉంటుందని సాయి చౌదరి పేర్కొన్నారు.



# సంస్థాగత నిర్మాణం,పార్టీ బలోపేతం పై దృష్టి సారించండి పార్టీ శ్రేనులకు డా.ప్రభ గౌడ్ పిలుపు



హైద్రాబాద్ జులై 7 ;సంస్థాగత నిర్మాణం,పార్టీ బలోపేతం పై దృష్టి సారించాలని పార్టీ శ్రేనులకు బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానెలిస్టా డా.ప్రభ గౌడ్ పిలుపు నిచ్చారు. సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ విస్తరణ, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాలు, సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ విస్తరణ, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాలు, రాబోయే పార్టీ కార్యాచరణపై ప్రభ గౌడ్ విస్తృతంగా చర్చించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు రామ్ చందర్ రావు , చంద్రశేఖర్ జి , చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు ,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర




భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లాలి ఆధ్వర్యంలో ఎల్బీ నగర్లోని వన్ కన్వెన్షన్ హాల్లో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది.ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానెలిస్టాడా. ప్రభా గౌడ్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.

ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ విస్తరణ, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాలు, రాబోయే పార్టీ కార్యాచరణపై ప్రభ గౌడ్ విస్తృతంగా చర్చించారు

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు రామ్ చందర్ రావు , చంద్రశేఖర్ జి , చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు ,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర పదాధికారులు, రాష్ట్ర వివిధ మోర్చాల పదాధికారులు, జిల్లా కమిటీ సభ్యులు, మాజీ కార్పొరేటర్లు, జిల్లా మోర్చాల అధ్యక్షులు మరియు ప్రధాన కార్యదర్శులు, జిల్లా శాశ్వత కమిటీ సభ్యులు, జిల్లా ప్రత్యేక ఆహ్వాన కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

# వైసీపీలో చీలిక ప్రకంపనలు

విజయవాడ, జూలై 7, ఏపీలో ప్రతిపక్షంగా ఉన్న వైసీపీలో చీలిక రానుందా? ఆ పార్టీ నాయకులు చీలిపోవడమో.. లేక కూటమిలోని ఓ పార్టీలో చేరిపోవడమో ఖాయంగా కనిపిస్తోందా? అంటే.. ఔనననే సమాధానమే వినిపిస్తోంది. నాయకుల మాటకు విలువ లేకపోవడం.. వారు చెప్పింది ఆలకించే స్థాయిలో జగన్ ఇంకా కనిపించక పోవడం.. వంటివి పెద్ద ఎత్తున చర్చకు వస్తున్నాయి. దీంతో ఇప్పుడు సీనియర్ల నుంచి జూనియర్ల వరకు తమకు అనుకూలంగా ఉన్న పార్టీలవైపు దృష్టి పెడుతున్నట్టు తెలుస్తోంది. ఇదే జరిగితే.. వైసీపీ చీలిక దిశగా అడుగులు వేయడం ఖాయమని అంటున్నారు.వాస్తవానికి పార్టీల్లో భిన్నాభిప్రాయాలు ఉండడం సహజమే. కానీ, కీలకమైన ప్రజల కోణంలో చూసినప్పుడు.. నాయకుల వాదనను కూడా పార్టీలు పట్టించుకోవాలి. ఉదాహరణకు.. పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీని వెనుకేసుకు వచ్చారు. ఇలా వద్దని పార్టీ నాయకులు కోరారు. ఆమె వినిపించుకోలేదు. ఫలితంగా పార్టీ ఓడిపోవడమే కాదు.. ఇప్పుడు పార్టీ నేతలు కూడా.. ఆమెను వదిలేసి వెళ్లిపోతున్నారు. ఇక, పార్టీనే మూసేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.అదేవిధంగా తమిళనాడులో అన్నాడీఎంకే.. బీజేపీతో పొత్తు పెట్టుకోవడాన్ని ఆ పార్టీ నాయకులు సహించలేదు. కానీ, నాయకుల మాటను పళని స్వామి వినిపించుకోలేదు. ఫలితంగా గెలిచే పార్టీ కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేక పోయింది. ఇలా.. నాయకుల మాట వినిపించుకోని పార్టీలు దేశంలో చీలిపోతున్నాయి. చిందరవందరగా కూడా మారుతున్నాయి. ఈ నేపథ్యంలోనే వైసీపీలోనూ చీలిక దిశగా అడుగులు పడుతున్నాయన్న చర్చ జరుగుతోంది.గతంలో మూడు రాజధానులు సహా.. ప్రస్తుత మావిగన్ ప్రతిపాదన వంటివి వైసీపీ నాయకులు జీర్ణించుకో లేకపోతున్నారు. ఎన్నికల సమయంలో ఎవరికి టికెట్ ఇస్తారో.. ఎవరిని మారుస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. అలానే.. తమకు ఏమాత్రం వాల్యూ లేకుండా చేస్తున్నారని సీనియర్లు వాపోతున్నారు. ఈ పరిణామాల క్రమంలోనే నాయకులు పక్క చూపులు చూస్తున్నారు.

# విశ్వబ్రాహ్మణులను ఒకే కులం గా ప్రభుత్వం గుర్తించాలి బిసి కుల సంఘాల జేఏసీ చెర్మెన్ కుందారం గణేష్ చారి




హైద్రాబాద్ జులై 7; విశ్వబ్రాహ్మణులను ఒకే కులం గా ప్రభుత్వం గుర్తించాలనిబిసి కుల సంఘాల జేఏసీ చెర్మెన్ కుందారం గణేష్ చారి డిమాండ్ చేశారు.

సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో విశ్వకర్మ జేఏసీ ఆధ్వర్యంలో మీటింగ్ ఏర్పాటు చేయడమైనదిగా తెలంగాణ తొలి శాసనసభాపతి సిరికొండ మధుసూదనా చారి బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ చారి అట్లూరి రవీంద్ర చారి అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సమావేశం లో మెట్రో పత్రిక ఎటర్ కాళిదాసు భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగనపల్లి రవికుమార్ నరసింహాచారి బ్రహ్మాచారి కుమార్ స్వామి మారోజు సుదర్శన చారి శంకరాచారి ముత్తోజు మధు కుందారం గణేష్ చారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులు ఒకే కులం గా ప్రభుత్వం గుర్తించాలి మొన్న జరిగిన కులగణలో ఐదు జాయిలవారిని ఒక్కొక్క సంఘముగా గుర్తించడం జరిగినది అలా కాకుండా విశ్వబ్రాహ్మణులను విశ్వకర్మలను ఒకే కులం గా గుర్తించి దాదాపు 12 లక్షల మంది విశ్వకర్మలు ఉన్నారు స్వాతంత్ర 70 సంవత్సరాల్లో అడుగడుగునా అన్యాయం జరిగిన మొదటి జాతి విశ్వబ్రాహ్మణ జాతి ప్రభుత్వం నామినేట్ పోస్టులో విశ్వబ్రాహ్మణులకు తగిన ప్రార్థన ఇవ్వాలి. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ను తెలంగాణ జాతిపితగా జీవో ప్రభుత్వము తీయాలి విశ్వబ్రాహ్మణులకు కార్పొరేషన్కు ఒక 1000 కోట్ల రూపాయలు కేటాయించి పాలకమండలి నియమించాలని సమావేశం డిమాండ్ చేసింది

# అంతర్ జిల్లా దొంగలను పట్టుకున్న పోలీసులు రిమాండ్ కు తరలింపు




**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి జూలై -07** వేములవాడ పరిధిలో అనుమానస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా వారు వేములవాడ ప్రాంతంలో సెల్ ఫోన్లు మోటార్ సైకిల్ ఇతర వస్తువులను దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారని ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేములవాడ టౌన్ పరిధిలో కరీంనగర్ కు చెందిన దుర్గం సాయి కృష్ణ 23 సంవత్సరాలు, ఎస్ కే సల్మాన్ 25 సంవత్సరాలు వీరిద్దరూ గత కొంతకాలంగా పట్టణంలో తిరుగుతూ పలు ప్రాంతాల్లో సెల్ ఫోన్లు మోటార్ సైకిల్ ఇతర వస్తువులను దొంగతనాలకు పాల్పడ్డారనీ వీరు దొంగిలించిన హీరో స్పెండర్ మోటార్ సైకిల్ ఝూ15ఝూ2592 తోపాటు మొత్తం ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని వారిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామని దొంగలను పట్టుకోవడానికి చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై రామ్మోహన్, కానిస్టేబుల్ గోపాల్, కాజా అమ్రానుద్దీన్, సల్మాన్ లను అభినందిస్తూ ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేయకుండా బయటకు వెళ్ళకూడదని విలువైన వస్తువులను నిర్లక్ష్యంగా ఉంచవద్దని ఎవరైనా అనుమానాస్పదంగా వ్యక్తులు కనబడిన సమీప పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని సూచించారు.

# బోధన నాణ్యతకు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ,ఉపాధ్యాయులకు రెండు విడతల్లో శిక్షణ, ఈ నెల 9 నుంచి ప్రారంభం

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జులై 7:ప్రభుత్వ పాఠశాలల్లో బోధన నాణ్యతను మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులకు మూడు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ‘ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఫర్ క్వాలిటీ లెర్నింగ్ త్రూ ట్రాన్స్ఫార్మేటివ్ క్లాస్రూమ్ ప్రాక్టీసెస్’ పేరిట ఈ శిక్షణలు నిర్వహించనున్నారు.మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 2,877 మంది ఉపాధ్యాయులకు జిల్లా, మండల స్థాయిల్లో రెండు విడతలుగా శిక్షణ ఇవ్వనున్నారు. తొలి విడత ఈ నెల 9 నుంచి ప్రారంభం కానుంది. జిల్లాలోని డీపీఎస్ నాచారం, జెడ్పీహెచ్ఎస్ నాగోల్, జెడ్పీహెచ్ఎస్ కూకట్పల్లి కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులకు విడుతల వారీగా శిక్షణ అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 30 నాటికి శిక్షణ కార్యక్రమాలు పూర్తవుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి వెల్లడించారు.

# జగ్గారెడ్డికి జన నీరాజనం....

# జన్మదిన వేడుకలతో హోరెత్తిన సంగారెడ్డి











సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 7(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:సంగారెడ్డి/జనం మెచ్చిన నాయకులు ఇలాగే ఉంటారేమో... ఆదరిస్తే అభిమానం ఇలాగే ఉంటదేమో....అభిమానానికి కులం మతం వయస్సు చిన్న పెద్ద తేడా ఉండదేమో... నిజమే కావొచ్చు కూడా... అవును నిజమే మరి సంగారెడ్డిలో జగ్గారెడ్డిని జనాలు అలాగే చూస్తారు కూడా...మంగళవారం నాడు సంగారెడ్డిలో జరిగిన జగ్గారెడ్డి ఆయన కూతురు జయారెడ్డిల జన్మదిన వేడుకలలో అభిమానం హోరెత్తింది,డప్పు చప్పుళ్ళ,వాయిద్యాలతో కులమతాలకు అతీతంగా చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ వారి తోచిన విధంగా వేలాది మంది జగ్గారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు,సంగారెడ్డిలో స్థానిక ఐబీ వద్ద జనాల నడుమ జగ్గారెడ్డి ఆయన కూతురు జయారెడ్డి కేక్ కట్ చేశారు,అనంతరం జనంలో కలిసి "ఆయామా డిస్కో డాన్సర్"అంటూ స్టెప్స్ వేస్తూ జనాన్ని ఉర్రూతలూగించాడు,ఐబీ నుండి పాత బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్ళి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు,జగ్గారెడ్డి జనంతో సరదాగా మాట్లాడుతూ నా తల్లిదండ్రులు జమాయమ్మ, జగ్గారెడ్డిలు నాకు అదృష్టంతో కూడిన పుట్టుకనిచ్చి ఈరోజుకు అరవై ఏళ్లు ఈ అరవై ఏళ్లలో ఎన్నో అవమానాలు,సన్మానాలు,అజ్ఞాత వాసాలు,కష్టాలు,సుఖాలు...

ఇదే నా జీవితం : జగ్గారెడ్డి

నాది బ్రహ్మాండమైన పుట్టుక, జన్మ, అదృష్టంతో కూడిన జన్మను నా తల్లి జమాయమ్మ, జగ్గారెడ్డి నాకు ఇచ్చారు,ఎవరికి కష్టం వచ్చినా సాయం చేసే గుణం మా నాయిన, అమ్మది.. అదే గుణం నాకు వచ్చింది,అందుకే మా నాన్న దోస్తులు నా పేరును జగ్గారెడ్డిగా మార్చారు,నేను పుట్టిన రోజే నా కూతురు కూచమ్మ (జయారెడ్డి) పుట్టింది, జీవితం అంటేనే ఆడాలి.. పాడాలి .. ఆస్వాదించాలి.. అనుభవించాలి,ఈరోజు నా బర్త్ డే అయినా రాజకీయ నాయకుడిగానే మాట్లాడతా,రాజకీయంగా సోనియా గాంధీ ,రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే,సీఎం రేవంత్ రెడ్డి, టిపిసిసి చీఫ్ మహేష్ గౌడ్, ఇంచార్జి మీనాక్షి ల నాయకత్వంలో.. మంత్రులందరి సహకారము ఉంది, పోయిన ప్రభుత్వానికి దీనికి తేడా ఉందా లేదా,ఇది కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజా ప్రభుత్వం,పదేళ్లలో కలెక్టర్ కు ప్రజా సమస్యలు చెప్పుకునే పరిస్థితి ఉండేదా.. పోలీసులు అనుమతులు ఇచ్చేవాళ్ళా, ఇప్పుడు డైరెక్ట్ గా కలెక్టర్ దగ్గరకు పోతున్నారుగా.. పోలీసులు ఆపడం లేదుగా, ఏదేమైనా కాంగ్రెస్ కాంగ్రెస్సే,సంసారం అన్నాక సమస్యలు ఉంటాయి కానీ సమస్యలు చెప్పుకుని పరిష్కరించుకునే స్వేచ్ఛ కాంగ్రెస్ లోనే ఉంటుంది అని అన్నారు.

## ప్రకాశ్ రాజ్‌పై కదిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బీజేపీ నేతలు

హైదరాబాద్, జూలై 7 ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్‌పై ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, ఇతర బీజేపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హిందూ సమాజాన్ని కించపరిచేలా, కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపిస్తూ కదిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు దాఖలు చేసినట్లు బీజేపీ నేతలు తెలిపారు. ఈ మేరకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. "ప్రకాశ్ రాజ్ హిందూ సమాజంపై చేస్తున్న అవమానకర వ్యాఖ్యలను బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను అవమానించే చర్యల వెనుక ఆయన ప్రోద్బలం ఉంది" అని ఆరోపించారు.అంతేకాకుండా, వివాదాస్పద యూట్యూబర్ జోసెఫ్‌కు, దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ హిందూ సమాజాన్ని అవమానించే ప్రకాశ్ రాజ్‌కు మద్దతిస్తున్న వైసీపీ, సీపీఐ, సీపీఎం పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆ

## ప్రత్యేక ఓటరు సవరణ (SIR) కార్యక్రమంలో పాల్గొన్న తలసాని శ్రీనివాస్ యాదవ్ దంపతులు



మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (SIR)లో పాల్గొన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి వచ్చిన బూత్ లెవల్ ఆఫీసర్ (BLO) శ్రీనివాస్, సూపర్‌వైజర్ శివకుమార్‌లకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తన పూర్తి వివరాలతో కూడిన ఎన్యుమరేటర్ పత్రాన్ని అందజేశారు.

అదేవిధంగా ఆయన సతీమణి తలసాని స్వర్ణ కూడా ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా తమ వివరాలను అధికారులకు సమర్పించారు. అలాగే సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, ఆయన సతీమణి కూడా తమ వివరాలతో కూడిన ఎన్యుమరేటర్ పత్రాలను SIR అధికారులకు అందజేశారు.



ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల ఓటరు వివరాలను అధికారులు నమోదు చేసి, ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమానికి సంబంధించిన ప్రక్రియను పూర్తి చేశారు.

## రాజ్యాధికారంతోనే మనుగడ

### నాలుగైదు శాతం ఉన్న విశ్వర్మీయులను విస్మరిస్తారా..?

### మండలి ప్రతిపక్ష నేత మధుసూదన్ చారి రౌండ్ టేబుల్ సమావేశంలో 6 తీర్మానాలు ఆమోదం

హైదరాబాద్ విశ్వబ్రాహ్మణులు ఒక శక్తిగా ఎదగాలని, రాజ్యాధికారంలో వాటా చేజిక్కించుకోవాలని శాసనమండలిలో ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి పిలుపునిచ్చారు. రాజ్యాధికారంతోనే ఏ కులానికైనా గుర్తింపు, మనుగడ ఉంటాయన్నారు. ఐదు వృత్తులను వేర్వేరు కులాలుగా చూపెట్టి... విశ్వకర్మ జాతి జనాభాను తక్కువ చేసి చూపెట్టడం అత్యంత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో కేవలం రెండు శాతం ఓట్లే అధికారాన్ని తారుమారు చేస్తున్న తరుణంలో రాష్ట్ర జనాభాలో 4-5 శాతం ఉండే విశ్వబ్రాహ్మణులు ఎన్నికల్లో కీలకంగా మారతారని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో విశ్వకర్మ కమ్యూనిటీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ తొలి శాసనసభాపతి పాల్గొన్నారు.




కాంగ్రెస్ పార్టీ నాయకుడు తంగెళ్లపల్లి రవి హాజరై... విశ్వబ్రాహ్మణుల కులం గుర్తింపు, ఐక్యత గురించి మాట్లాడారు. గ్లోబల్ విశ్వకర్మ ఎన్ఆర్ఐ ప్రతినిధి చైతన్య కూడా పాల్గొని... తన సామాజిక వర్గం అభ్యున్నతికి తనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తానన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో భాగంగా ముఖ్యమైన ఎజెండాగా ఆరు తీర్మానాలను ప్రవేశపెట్టి, ఆమోదించుకున్నారు. ఇందులో ప్రధాన తీర్మానంగా ఐదు వృత్తులైనా... ఒక్కటే కులం... అదే విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణుల కులం అని చాటిచెప్పారు. విశ్వకర్మల వృత్తులను భావితరాలకు చాటిచెప్పేందుకు మ్యూజియం ఏర్పాటుకు ప్రభుత్వం సహకరించాలని, వృత్తులను పరిరక్షించాలని, ఆర్థికంగా అండగా నిలవాలని తీర్మానాలు ఆమోదించారు. చివరగా తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ పేరుతో అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు.

పాలకులు తమ తప్పులను సరిదిద్దుకోని పక్షంలో, పోరాటానికి సన్నద్ధమవ్వాలని, న్యాయమైన డిమాండ్ల సాధనకు రాజకీయ నాయకులను, ప్రభుత్వాన్ని కలిసి ఒత్తిడి చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రసంగించిన వక్తలంతా ముక్తకంఠంతో నినదించారు. వచ్చేనెలలో మూడో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. సమావేశంలో జర్నలిస్ట్ మరియు పారిశ్రామిక వేత్త దేవరకొండ కాళిదాస్, విశ్వకర్మ వేదిక వ్యవస్థాపకులు ఆడ్లూరి రవీంద్రా చారి, రచయితల సంఘం నుంచి గాజోజు నాగభూషణం, కుందారం గణేశాచారి, ఉపేంద్రాచారి, దుబ్బాక కిషన్‌రావు, ప్రముఖ ఆంకోలాజిస్ట్ డాక్టర్ చింతమడక సాయిరాం, వేదాస్ అధ్యక్షుడు కుమారస్వామి, సదాశ్రీ తదితరులు పాల్గొని విశ్వబ్రాహ్మణులు ఐక్యమత్యం కావాలన్నారు.

# రావణ్ లింక్ ప్రకాష్ కి చుట్టుకుంటోందా...

ఏలూరు, జూలై 7, గత రెండు మూడు రోజుల నుండి ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ తన సోషల్ మీడియా అకౌంట్స్ ద్వారా ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై ఏ రేంజ్ లో విరుచుకుపడుతున్నారో మన కళ్లారా చూస్తూనే ఉన్నాం. మాత విద్వేషాలను రెచ్చగొట్టే 'ప్రశ్న రావణ్' ని అరెస్ట్ చేస్తే , ప్రకాష్ రాజ్ కి ప్రాణం పోయినంత పని అయ్యింది. అతని కోసం రోజుకి రెండు మూడు వీడియోలు అప్లోడ్ చేస్తూ 'జనం చూస్తున్నారు' అంటూ ఆయన మాట్లాడుతున్న మాటలపై సోషల్ మీడియా లో నెటిజెన్స్ తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. తీవ్రవాదులను ప్రోత్సహిస్తూ , హిందూ దేవుళ్లపై దుర్భాషలాడుతూ , ఇష్టమొచ్చినట్టు మాట్లాడే రావణ్ కోసం ప్రకాష్ రాజ్ ఇంతలా పోరాడడం సిగ్గు చేటు అంటూ మండిపడుతున్నారు. ఇక నేడు ప్రకాష్ రాజ్ అప్లోడ్ చేసిన వీడియో అయితే జనాల్లో అనేక అనుమానాలకు భీజం పోసింది.ప్రకాష్ రాజ్ మాట్లాడుతూ 'ఇప్పుడు పోలీసులు రావణ్ మొబైల్ ని తీసుకొని , అతని వద్ద ఉన్నటువంటి సమాచారం మొత్తాన్ని సేకరిస్తారు. అతనికి మద్దతుగా నిలబడిన ప్రతీ ఒక్కరిని ఇబ్బందులకు గురి చేస్తారు, ఇదే కదా జరిగేది' అంటూ ఒక సంచలన వ్యాఖ్య చేశారు. ఇది విన్న తర్వాత ఇన్ని రోజులు ప్రకాష్ రాజ్ బాధపడింది రావణ్ ని అరెస్ట్ చేసినందుకు కాదు , అతనితో ఈయన నడిపిన గూడూపుఠాణి మొత్తం బయటపడుతుంది అనే భయం తోనే ప్రకాష్ రాజ్ ఇంతలా ఆరాటపడుతున్నారు , వణికిపోతున్నారు అంటూ సోషల్ మీడియా లో నెటిజెన్స్ అంటున్నారు. రావణ్ , ప్రకాష్ రాజ్ లను నడిపిస్తున్న నెట్ వర్క్ మొత్తం ఈ రిమాండ్ రిపోర్ట్ లో బాటపడబోతుందని, ఇక వీళ్ళ ఆట ముగిసిపోయింది అంటూ సోషల్ మీడియా లో విశ్లేషకులు అంటున్నారు. ఇదంతా పక్కన పెడితే , ప్రకాష్ రాజ్ కి తమిళనాడు డీఎంకే పార్టీ తో ఎంత మంచి సాన్నిహిత్యం ఉందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.వాళ్లకు మద్దతుగా, ఆ పార్టీ నాయకులతో , ఎమ్మెల్యేలతో మంత్రులతో కలిసి ఎన్నో ప్రెస్ మీట్ లు కూడా ఇచ్చారు. ఒక ప్రెస్ మీట్ లో అయితే పత్తి ఎమ్మెల్యే తో ప్రకాష్ రాజ్ మాట్లాడుతూ 'బాగా మాట్లాడానా ?, ఇంకా ఏమేమి మాట్లాడాలి' అని అడగడం , అందుకు సదరు నేత సూచనలు ఇవ్వడం వంటివి మన కళ్లారా చూశాము . అలాంటి పార్టీ కి చెందిన ఎమ్మెల్యే ని తమిళనాడు సీఎం విజయ్ అరెస్ట్ చేయిస్తే ప్రకాష్ రాజ్ ఇప్పటి వరకు నోరు మెదపలేదు. తన సన్నిహిత పార్టీ ఎమ్మెల్యే అరెస్ట్ అయితే ఇప్పటి వరకు స్పందించని ప్రకాష్ రాజ్ , ఒక సాధారణ యూట్యూబర్ అరెస్ట్ అయితే , ఎందుకు ఇంతలా ఉలిక్కిపడుతున్నారు?, కచ్చితంగా వీళ్లిద్దరి మధ్య ఎదో జరిగింది అంటూ సోషల్ మీడియాలో నెటిజెన్స్ అనుమానిస్తున్నారు.

# రోడ్డు ప్రమాదం లో ఒకరి మృతి

మచిలీపట్నం?కత్తిపూడి 216 జాతీయ రహదారిపై పెడన సమీపంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగాయలంక సమీపంలోని దీనదయాళపురం గ్రామానికి చెందిన సంతోష్రావు (47) మృతి చెందారు.

సంతోష్రావు పెడనలో రైల్వే ట్రాక్పై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనుల వద్ద సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి విధులు ముగించుకుని మంగళవారం ఉదయం తోటమూలలోని తన ఇంటికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఉదయం 5 గంటల సమయంలో పెడన సమీపంలో గుర్తుతెలియని వాహనం ఆయన ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో సంతోష్రావు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాద తీవ్రతకు ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వాహనం 100 అడుగులకు పైగా ఈడ్చుకెళ్లినట్లు సమాచారం.

సంఘటనా స్థలాన్ని పెడన సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. నాగేంద్రప్రసాద్, పెడన ఎస్సై జి. సత్యనారాయణ పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మృతుడు సంతోష్రావుకు భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురు పిల్లలు చదువుకుంటున్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

# టీఆర్పీలపై కేంద్రం నిషేధం...

హైదరాబాద్, జూలై 7, టీవీ చానెల్స్ కి కేంద్ర ప్రభుత్వం ఊహించని షాక్ ఇచ్చింది. టీవీ చానెల్స్ ఆదాయానికి కొలమానం గా నిలిచే ఖీఖ రేటింగ్స్ పై నిషేధం విధిస్తు కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ రేటింగ్స్ ఆధారంగానే టీవీ చానెల్స్ కి కమర్షియల్ యాడ్స్ వస్తుంటాయి. రేటింగ్స్ ని బట్టే టీవీ చానెల్స్ యాజమాన్యాలు భారీ రేంజ్ యాడ్స్ ద్వారా డబ్బులు సంపాదిస్తూ ఉంటారు. ఇకపై అలాంటి అవకాశాలు తగ్గిపోనున్నాయి. దేశం లోని అన్ని రకాల టీవీ చానెల్స్ ర్యాంకింగ్స్ , రేటింగ్స్ ని నిలిపివేస్తూ కేంద్ర సమాచార, ప్రసారాల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతం లో ఈ టీఆర్పీ రేటింగ్స్ వ్యవహారం లో తీవ్రమైన వివాదాలు తలెత్తాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం న్యూస్ చానెల్స్ రేటింగ్స్ ని నిలిపివేసింది.ఇప్పుడు లేటెస్ట్ గా జనరల్ ఎంటర్టైన్మెంట్ , సినిమా , స్పోర్ట్స్ సహా అన్ని రకాల ఎంటర్టైన్మెంట్ చానెల్స్ కి కూడా రేటింగ్స్ ని నిలిపివేసింది. ఈ కఠిన నిర్ణయం వెనుక కారణాలు ఉన్నాయి. కొన్ని ఛానళ్ళు అనుచిత , అక్రమ పద్ధతులు అనుసరించడమే అందుకు ప్రధాన కారణం. బ్రాడ్కాస్ట్ ఆడియన్స్ రీసెర్చ్ కౌన్సిల్ లెక్కిస్తున్న ప్రస్తుత బార్-ఓ-మీటర్ల వ్యవస్థను కొన్ని పెద్ద నెట్ వర్కులు మేనేజ్ చేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. తప్పుడు పద్ధతుల్లో రేటింగ్స్ ని పెంచుకొని ప్రకటనదారులు మోసం చేస్తున్నాయనే ఆరోపణలు ఈమధ్య కాలం లో ఎక్కువగా వెల్లువెత్తాయి. కేవలం రేటింగ్స్ రేసులో ముందంజలో ఉండడం కోసం ఛానళ్ళు కంటెంట్ లోని నాణ్యత ని దిగజారుస్తున్నారని , అది సమాజం పై తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది.ప్రస్తుతం అమల్లో ఉన్న ఈ టీఆర్పీ రేటింగ్స్ విధానానికి ప్రత్యామ్నాయంగా పారదర్శకతతో కూడిన వ్యవస్థని తీసుకొని రావాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం సాంకేతిక నిపుణులు , ఐటీ రంగ నిపుణులతో కూడిన ఒక ఉన్నత స్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేసింది కేంద్ర ప్రభుత్వం. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా సూచనల ప్రకారం డిజిటల్ సెట్-టాప్ బాక్సుల ద్వారా వచ్చే డేటాను రియల్-టైమ్లో పారదర్శకంగా చూసే విధానాన్ని ఈ ప్రత్యామ్నాయ వ్యవస్థ కోసం పరిశీలిస్తున్నారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం టెలివిజన్ ఇండస్ట్రీ ని , అడ్వర్టైజింగ్ రంగాన్ని తీవ్రగ్భ్రాంతికి గురిచేసింది.

ఎందుకంటే ప్రతీ ఏటా వేల కోట్ల రూపాయిల ఆదాయం యాడ్స్ రూపం లో వచ్చేవి , ఇవన్నీ రేటింగ్స్ ఆధారంగానే జరిగేవి. ఇప్పుడు కొత్త వ్యవస్థ అమ్మల్లోకి వచ్చే వరకు రేటింగ్స్ నిలిపివేయడం వల్ల వంద కోట్ల నష్టాలు వాటిల్లే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరి రాబోయే రోజుల్లో ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో చూడాలి.

# ప్రహ్లాదపురంలో ఘోరం

## వృద్ధురాలిని హత్య చేసి, బంగారం దోచుకెళ్లిన దుండగులు



పెందుర్తి: స్థానిక ప్రహ్లాదపురంలో అర్ధరాత్రి వేళ ఓ దారుణ ఘటన వెలుగుచూసింది. ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న కర్రీ పైడమ్మ (72) అనే వృద్ధు రాలిని గుర్తుతెలియని దుండగులు అత్యంత కిరాతకంగా దాడి చేసి హత్య చేశారు. అనంతరం ఆమె శరీరంపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకుని పారిపోయారు ?ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 112 ద్వారా పోలీసులకు సమా చారం అందించారు దీంతో పెందుర్తి సీఐ సతీశ్ కుమార్ తన సిబ్బందితో కలిసి వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు క్లూస్ టీమ్ రంగంలోకి దిగి అక్కడ లభించిన ఆధారాలను సేకరించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ను వేగవంతం చేశారు ?ఈ ఘోర కలికలం స్థానిక ప్రజల్లో తీవ్ర భయాం దోళనలను కలకలాన్ని రేపింది.

# మహారాష్ట్రను ముంచెత్తుతున్న వానలు

## 200 మిమీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదు

ముంబై, జూలై 7, మహారాష్ట్ర వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు ఉగ్రరూపం దాల్చాయి. గత 48 గంటలుగా కురుస్తున్న అసాధారణ భారీ వర్షాలకు ఆర్థిక రాజధాని ముంబైతో పాటు సాంస్కృతిక రాజధాని పుణె నగరం పూర్తిగా స్తంభించిపోయాయి. ముఖ్యంగా పుణె జిల్లాలోని పశ్చిమ కనుమలు పరిధిలో మేఘమథనం జరుగుతోంది. ఘాట్ సెక్షన్లలోని పలు వాతావరణ కేంద్రాల్లో ఇప్పటికే 200 మిమీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదు కాగా, పుణె నగర పరిసర ప్రాంతాల్లో సగటున 100 మిమీ మార్కును దాటేసింది. ఈ జలప్రళయం కారణంగా ఇటు పుణె, అటు ముంబై, కొంకణ్ రీజియన్లలో జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. భారత వాతావరణ శాఖ ముంబై, ఠాణే, పాల్ఘర్, రాయ్గఢ్ జిల్లాలకు అత్యంత ప్రమాదకరమైన రెడ్ అలర్ట్ జారీ చేసింది.

ఈ భారీ వర్షాల ధాటికి ముంబై-పుణె నగరాల మధ్య రవాణా వ్యవస్థ పూర్తిగా పడకేసింది. నిరంతరాయంగా కురుస్తున్న వానలకు ముంబై-పుణె ఎక్స్ప్రెస్వే లోని ఖోపోలి-కుస్గావ్ మిస్సింగ్ లింక్ సొరంగం సమీపంలో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. టన్నుల కొద్దీ రాళ్లు, మట్టి రోడ్డుపైకి దూసుకురావడంతో ఎక్స్ప్రెస్వేతో పాటు పాత ముంబై-పుణె హైవేపై కూడా రాత్రీపగలు ట్రాఫిక్ను పూర్తిగా నిలిపివేశారు. ముంబై డివిజన్ పరిధిలోని థాకూర్వాడి – మంకీ హిల్ సెక్షన్ల మధ్య రైల్వే ట్రాక్లపై కూడా కొండరాళ్లు పడటంతో ముంబై-పుణె మధ్య నడిచే ఇంటర్సిటీ మరియు సుదూర ప్రాంతాల రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది లేదా దారిమళ్లించింది. వర్షాల తీవ్రతను దృష్ట్యా ముంబై, పుణె, ఠాణే, నవీ ముంబై పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీలకు విద్యాశాఖ తక్షణ సెలవు ప్రకటించింది. ప్రైవేట్ ఆఫీసుల ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని విపత్తు నిర్వహణ శాఖ సూచించింది. రహదారులపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. పుణె జిల్లాలోని మావల్ తహసీల్ పరిధిలో ఒక ఇల్లు కొండచరియల కింద నలిగిపోగా, ఇంద్రాయణి నది ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ఆలంది మున్సిపల్ కౌన్సిల్ నదిపై ఉన్న అన్ని వంతెనలను మూసివేసింది. పుణె-కోలాడ్ రోడ్డు ఒక విభాగంలో కుంగిపోవడంతో ఆ రూట్ క్లోజ్ అయింది. పర్యాటకుల భద్రత దృష్ట్యా ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన సింహగడ్ కోట ను రెండు రోజుల పాటు పూర్తిగా బంద్ చేశారు. పుణె శివార్లలో వరదల్లో చిక్కుకుపోయిన ఒక ప్రైవేట్ బస్సులోని 37 మంది ప్రయాణికులను ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ప్రాణాలకు తెగించి సురక్షితంగా రక్షించాయి. ఇటు ముంబై నగరంలో పరిస్థితి మరింత దారుణంగా మారింది. విక్రోలి, కొలాబా, మాతుంగ వంటి లోతట్టు ప్రాంతాలు మోకాళ్లోతు నీటిలో మునిగిపోయాయి. పశ్చిమ రైల్వే పరిధిలోని వసాయ్ రోడ్ – విరార్ సెక్షన్లలో పట్టాలు పూర్తిగా నీట మునగడంతో 20 కి పైగా ఎక్స్ప్రెస్ రైళ్లు మధ్యలోనే నిలిచిపోయాయి. ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ ఎయిర్పోర్టులో రన్వే రక్షణ చర్యల దృష్ట్యా విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మహారాష్ట్ర అసెంబ్లీని సైతం వర్షాల కారణంగా ఒకరోజు వాయిదా వేయాల్సి వచ్చింది. గత 3-4 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా వర్ష సంబంధిత ఘటనల్లో 13 మంది ప్రాణాలు కోల్పోయారని విపత్తు నిర్వహణ మంత్రి గిరీష్ మహాజన్ ప్రకటించారు.

# సియా మహానటి..

## స్నాప్ చాట్ లో దొరికిపోయిన చేతన్

జైపూర్, జూలై 7,ఆమె అమాయకురాలు కాదు. మహానటి.. కుటుంబ సభ్యుల ముందు నటించింది. కేతన్ అగర్వాల్ ముందు నటించింది. అతడు దగ్గరనుంచి కోటి రూపాయలు డబ్బు తీసుకుంది. కేతన్ అగర్వాల్ తల్లిదండ్రుల ముందు కూడా నటించింది. అతడిని రెండుసార్లు కోటకు తీసుకెళ్లింది. రెండుసార్లు కూడా అతడిని చంపే ప్రయత్నం విఫలమైంది. మూడోసారి బాలిదాకా వెళ్లాలి అనుకుంది. కానీ ఆ ప్లాన్ ఫ్లాఫ్ అయింది. చివరికి తన నటన కౌశలాన్ని ప్రదర్శించి కాబోయే వాడిని కోటకు తీసుకెళ్లింది. తన ప్రేమికుడితో లేపేసింది.మూడో కంటికి తెలియకుండా చంపేశాం కాబట్టి ఇబ్బంది లేదు.. దొరికిపోయే అవకాశం లేదు అనుకుంది సియా. కానీ చేసిన ఘోరం.. ఎప్పటికీ దాగదు. ఒక చిన్న ఆధారం సియాను పట్టించింది. ఆమె ప్రియుడిని దొరికేలా చేసింది. ఆ తర్వాత ఈ కేసును ప్రత్యేక పోలీసుల బృందం దర్యాప్తు చేయడం మొదలుపెట్టింది. ఈ దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సియా కేతన్ నుంచి కోటి రూపాయలు వసూలు చేయడం.. వాటిని తన ప్రియుడు చేతన్ కు ఇవ్వడం.. చేతన్ కూడా కేతన్ అగర్వాల్ ను చంపే క్రమంలో తన ఫోన్ వాడకపోవడం.. తన కారును పక్కనపెట్టి వేరే వ్యక్తి బైక్ ఉపయోగించడం.. తన దగ్గర పనిచేస్తున్న వ్యక్తి ఫోన్ వాడటం వంటివి చేశాడు. దీంతో ఈ కేసులో బలమైన ఆధారాలు పోలీసులకు లభించాయి. దీనికి తోడు సియా వాడిన స్పై ఫోన్.. కోడింగ్ లాంగ్వేజ్ వంటివి పోలీసులకు అనుమానం కలిగించాయి. ఆ తర్వాత వాటిని డీకోడ్ చేస్తుంటే అసలు విషయాలు వెలుగు చూస్తున్నాయి.ఇప్పటిదాకా స్పై ఫోన్.. ఇతర ఆధారాలు మాత్రమే పోలీసులు సేకరించ గలిగారు. తాజాగా సియా స్నాప్ చాట్ లో జరిపిన ఓ సంభాషణ ఆమెను అడ్డంగా దొరికేలా చేసింది. స్నాప్ చాట్ లో సియా తన స్నేహితురాలికి వివాహ ఆహ్వానాన్ని పంపించింది. గెస్టులకు ఇచ్చే ఇంటర్ టికెట్ బుక్ చేసేందుకు ఆధార్ కార్డు పంపాలని ఆమెను కోరింది.. అయితే ఇక్కడ అసలు ట్విస్ట్ చోటు చేసుకుంది. ఎందుకంటే ఈ పెళ్లి జరగదని సియాకు తెలుసు. అదే విషయాన్ని స్నాప్ చాట్ లో ఆమె పేర్కొంది.. అంతేకాదు ఎలాగైనా సరే కేతన్ అడ్డు తొలగించుకోవాలని.. అతని శాశ్వతంగా వదిలించుకోవాలని సియా భావించింది. అందువల్లే స్నాప్ చాట్ లో ఈ పని చేసింది. వాస్తవానికి కేతన్ అంటే సియాకు ఇష్టం లేకపోయినప్పటికీ.. కుటుంబ సభ్యులు తీసుకురావడంతో ఆమె ఈ పని చేసినట్టు తెలుస్తోంది.. ఇప్పటికే సియా, చేతన్ ఫోన్ కాల్స్ ను పోలీసులు లోతుగా పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం పోలీసుల కస్టడీలో ఉన్న సియా, చేతన్.. ఇప్పటికే అనేక విషయాలను చెప్పారు. ఇంకా ఈ కేసులో మరిన్ని నిజాలను రాబట్టడానికి పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు.

కేతన్ తాత మృతి

నచ్చిన అమ్మాయిని పెళ్లి చేసుకోవాలి అనుకున్నాడు. పెళ్లి కోసం భారీగా ఏర్పాట్లు చేసుకున్నాడు. దానికోసం భారీగా ఖర్చు పెట్టాడు. ఏకంగా 17 కోట్లు పెట్టి రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయపూర్ ప్రాంతంలో ఒక అత్యంత విలాసవంతమైన హోటల్ బుక్ చేసుకున్నాడు. తన పెళ్లికి వచ్చే అతిధులను తీసుకురావడానికి హెలికాప్టర్లను బాడుగకు మాట్లాడుకున్నాడు.. అప్పట్లో ఎంగేజ్మెంట్ కూడా చాలా గట్టిగా చేసుకున్నాడు. బిజినెస్ సర్కిల్స్ మొత్తం తన గురించి మాట్లాడుకునేలాగా చేశాడు. చిన్న వయసులోనే స్థిరాస్తి వ్యాపారం లోకి వచ్చి భారీగా సంపాదించాడు. తన జీవితంలోకి వచ్చే అమ్మాయి గురించి గొప్ప గొప్ప కలలు కన్నాడు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. ఆ తర్వాత అతడి జీవితం మరో విధంగా మారింది. విధి పగబట్టింది. కాబోయే భార్య అతడిని చంపేసింది. పైగా ఆమెకు మరొక వ్యక్తితో సంబంధం ఉంది. తన ప్రేమికుడితో కలిసి తనకు కాబోయే భార్య తనను చంపేస్తుందని అతడు ఊహించలేదు. రెండుసార్లు తనను చంపే ప్రయత్నం విఫలమైందని అతడు చనిపోయిన తర్వాత తెలుసుకున్నాడు. అయినప్పటికీ జరగాల్సిన ఘోరం జరిగిపోయింది.ఇదంతా కూడా ఇటీవల కాలంలో మనం చూస్తున్న.. చదువుతున్న కేతన్ అనే స్థిరాస్తి వ్యాపారికి సంబంధించిన దీనగాథ. అతడు పోయిన బాధ నుంచి ఇంకా కుటుంబం తేరుకోలేదు. ఆ కేసు ఇంకా విచారణ దశలో ఉంది. రకరకాల మలుపులు తిరుగుతోంది. అతడు చనిపోయిన విషాదం గుండెను మెలి తిప్పుతుండగానే.. కేతన్ కుటుంబంలో మరో విషాదం చోటు చేసుకుంది.కేతన్ తాత దేవిచంద్ అగర్వాల్ అనారోగ్యంతో కన్నుమూశారు. కేతన్ చనిపోయిన దగ్గరనుంచి ఆయన ఆరోగ్య పరిస్థితి దారుణంగా మారిపోయింది. శనివారం రాత్రి అతనికి గుండెపోటు రావడంతో చనిపోయారు.. దీంతో కేతన్ కుటుంబం మరింత విషాదంలో కూరుకుపోయింది. కొడుకు మరణం.. తండ్రి మరణం.. ఇవన్నీ కూడా కేతన్ అగర్వాల్ తండ్రికి నరకం చూపిస్తున్నాయి. ఆయన విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టిస్తోంది.

## సిద్దిపేట జిల్లాలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహసీల్దార్

మెదక్, జూలై 7 సిద్దిపేట జిల్లాలో ఒక ప్రభుత్వ అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్గా పట్టుబడ్డాడు. చేర్యాల తహసీల్దార్గా విధి నిర్వహణలో ఉన్న కొర్రా దిలీప్ నాయక్, రూ.70,000 లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు.ఏసీబీ అధికారులు విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం, నాగపురి గ్రామంలోని పలు సర్వే నంబర్లకు సంబంధించి 11 నాలా (వ్యవసాయేతర భూమి మార్పిడి) దరఖాస్తుల ప్రాసెసింగ్ కోసం ఫిర్యాదుదారుడి నుంచి తహసీల్దార్ ఈ లంచం డిమాండ్ చేశారు. జమున కనకమ్మ మరియు ఇతరుల పేర్లపై ఉన్న 30 గుంటల భూమికి సంబంధించిన పనుల నిమిత్తం ఆయన ఈ మొత్తాన్ని తీసుకున్నారు.సోమవారం మధ్యాహ్నం చేర్యాలలోని తన కార్యాలయంలోనే దిలీప్ నాయక్ లంచం తీసుకుంటుండగా, పక్కా ప్రణాళికతో ఏసీబీ అధికారులు ఆయనను పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దిలీప్ నాయక్ను అరెస్ట్ చేసి, హైదరాబాద్లోని ఏసీబీ కేసుల విచారణ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఎవరైనా అధికారులు లంచం డిమాండ్ చేస్తే తమ టోల్-ఫ్రీ నెంబర్ 1064కు సమాచారం అందించాలని ఏసీబీ ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# కొత్త నేమ్ ... చైతన్యకు కలిసొస్తుందా...

హైదరాబాద్, జూలై 7, ఒకప్పుడు అక్కినేని ఫ్యామిలీకి చాలా మంచి క్రేజ్ ఉండేది. నాగేశ్వరరావు ఎన్నో వైవిధ్యమైన పాత్రలను చేసి ప్రేక్షకుల్లో విశేషమైన ఆదరణను సంపాదించుకున్నాడు. ఎన్టీఆర్ తో పాటు పోటీపడి నటించి ప్రేక్షకుల మన్ననలు పొందుతున్నాడు. ఇక ఆయన తర్వాత తన నట వారసుడిగా ఇండస్ట్రీ ఎంట్రీ ఇచ్చిన నాగార్జున సైతం ఇండస్ట్రీలో ఉన్న టాప్ హీరోల్లో తను కూడా ఒకడిగా ఎదిగాడు. ఇక ఇలాంటి క్రమంలోనే ఆ ఫ్యామిలీ నుంచి వచ్చిన మూడోతరం హీరోలు ఎంత మాత్రం వాళ్ళ సత్తాను చాటులేక పోతున్నారు. కారణం ఏంటి అంటే వాళు ్ళ ఎంచుకున్న సబ్జెక్టులు ప్రేక్షకులను ఏమాత్రం అట్రాక్ట్ చేయలేకపోతున్నాయి. మిగతా హీరోలతో పోలిస్తే వీళ్ళు చాలా వరకు వెనుకబడిపోయారనే చెప్పాలి. ఇలాంటి క్రమంలోనే అఖిల్ ప్రస్తుతం లెనిన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు. ఈ సినిమాతో ఎలాగైనా సరే తనకంటూ ఒక స్టాండర్డ్ ను ఏర్పాటు చేసుకోవాలనే ప్రయత్నంలో ఉన్నాడు. దానికోసమే ఆయన శతవిధాల కష్టపడుతున్నాడు. ఇక దాంతో పాటుగా తన పేరును నాగ అఖిల్ అని మార్చుకున్నట్టుగా కూడా తెలుస్తుంది. లెనిన్ మూవీ టైటిల్ లో నాగ అఖిల్ గా మనం చూడబోతున్నాం. వాళ్ల ఫ్యామిలీ లో ఉన్న హీరోలందరికి నాగ అనేది వస్తే సక్సెస్ సాధిస్తారు అనే ఒక నమ్మకాన్ని వాళ్ళు ఫాలో అవుతున్నారు. నాగేశ్వరరావు దగ్గర నుంచి నాగచైతన్య వరకు ప్రతి ఒక్కరికి పేరు ముందు నాగ అనేది కామన్ అయిపోయింది. అందుకే అఖిల్ సైతం తన పేరును నాగ అఖిల్ గా మార్చుకున్నట్టుగా తెలుస్తుంది. పేరు మార్చినంత మాత్రాన సక్సెస్ లు వస్తాయా అని కొంతమంది కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఏది ఏమైనా కూడా కొన్ని సెంటిమెంట్లను ఫాలో అవుతూ ముందుకు సాగినప్పుడే ఇండస్ట్రీలో సక్సెస్ లను సాధించగలం అనే ఒక కాన్ఫిడెంట్ తో అఖిల్ ముందుకు సాగుతున్నట్టుగా తెలుస్తుంది. ఇక ఏది ఏమైనా లెనిన్ సినిమాతో ఆయన సక్సెస్ ని సాధించాల్సిన అవసరమైతే ఉంది?

# డిజిటల్' పాలిటిక్స్ వర్సెస్ 'రోడ్ పాలిటిక్స్

హైదరాబాద్, జూలై 7, తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అత్యంత కీలకమైన, అనూహ్యమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మాజీ మంత్రి జగదీష్ రెడ్డి అన్నట్లు బీఆర్ఎస్ ఇంకా పూర్తిస్థాయి ప్రతిపక్ష పాత్ర పోషించడం లేదు అనే అసంతృప్తి నిజమేనని నిరూపిస్తూ.. గులాబీ గూటిలో పెద్ద చీలికే వచ్చేసింది. కేటీఆర్ లీడర్‌షిప్ స్టైల్ నచ్చక, పార్టీ అంతర్గత విభేదాలతో బీఆర్ఎస్ నుండి సస్పెండ్ అయిన కల్వకుంట్ల కవిత.. ఏకంగా తెలంగాణ రక్షణ సేన పేరుతో సరికొత్త ప్రాంతీయ పార్టీని స్థాపించి జోరుగా ప్రజల్లోకి వెళ్తున్నారు. కేటీఆర్ కేవలం సోషల్ మీడియా వేదికగా, ఏసీ రూముల్లో ప్రెస్ మీట్లు పెడుతూ డిజిటల్ పోరాటాలు చేస్తుంటే.. సొంత పార్టీ పెట్టుకున్న కవిత మాత్రం పాత ఉద్యమ శైలిని అందిపుచ్చుకుని నేరుగా రోడ్లెక్కి వీధి పోరాటాలు చేస్తుండటం గులాబీ కేడర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. కార్పొరేట్ తరహాలో సాగే కేటీఆర్ హైటెక్ పాలిటిక్స్‌కు కాలం చెల్లిందని భావించిన కవిత.. గ్రౌండ్ లెవెల్‌లో కరడుగట్టిన తెలంగాణ సెంటిమెంట్‌ను, నిరుద్యోగుల సమస్యలను ఎజెండాగా మార్చుకున్నారు. ఇటీవల బోడుప్పల్ పరిధిలో ప్రభుత్వ భూముల కేటాయింపు, ఉద్యమకారుల సంక్షేమం కోసం తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఆమె నేరుగా రంగంలోకి దిగి, పోలీసులతో వాగ్వాదానికి దిగి రోడ్డుపై బైఠాయించి అరెస్టయ్యారు. కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక ఇలా లాఠీలకు ఎదురునిలిచి అరెస్ట్ అయిన దాఖలాలు లేకపోవడంతో.. బీఆర్ఎస్ కిందిస్థాయి కేడర్ ఇప్పుడు కవిత నాయకత్వం గురించి చర్చించుకుంటున్నారు. సమస్యల పై పోరాడే అసలైన వారసురాలు కవితే అనే నరేటివ్‌ను ఆమె క్షేత్రస్థాయిలో బలంగా నిర్మిస్తున్నారు. అయితే కవితకు సమస్యలు సమస్యలు వస్తున్నాయి. ఆమె ప్రతిపాదించిన తెలంగాణ రక్షణ సేన ఁఖీూ అనే సంక్షిప్త నామంపై తీవ్ర అభ్యంతరాలు రావడంతో.. 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సమర్పించాలని, లేదంటే అప్లికేషన్ క్లోజ్ చేస్తామని ఈ? స్పష్టం చేసింది. అయితే, పేరు మార్చే ప్రసక్తే లేదని, అవసరమైతే న్యాయపోరాటం చేస్తానని కవిత సవాల్ విసిరారు. ఈ విప్లవాత్మక పోరాటాలు, కొత్త పార్టీ స్థాపన కవిత రాజకీయ భవిష్యత్తుకు ఖచ్చితంగా ఒక టర్నింగ్ పాయింట్‌గా మారేలా కనిపిస్తున్నాయి. కేసీఆర్ స్థాపించిన పాత తెలంగాణ రాష్ట్ర సమితి ని భారత్ రాష్ట్ర సమితి గా మార్చడం వల్లే తెలంగాణలో పార్టీ అధికారం కోల్పోయిందని నమ్మే పాత ఉద్యమకారులంతా ఇప్పుడు కవిత వెంటే నడవడానికి సిద్ధమవుతున్నారు. తాము రక్తం, చెమట చిందించి నిర్మించుకున్న ఁఖీూ అనే ఐడెంటిటీని తానే కాపాడుకుంటానని కవిత చెప్పడం సెంటిమెంట్‌గా కేడర్‌ను అమితంగా ఆకర్షిస్తోంది. ఈ కొత్త పొలిటికల్ ఈక్వేషన్ కేటీఆర్‌ను తీవ్ర రక్షణలో పడేస్తోంది. ఒకవైపు అధికార కాంగ్రెస్‌ను ట్విట్టర్‌లో ఢీకొట్టడం కంటే.. సొంత చెల్లెలు పెట్టిన పార్టీ వైపుకు తమ కేడర్ వలస వెళ్లకుండా చూసుకోవడమే కేటీఆర్‌కు ఇప్పుడు పెద్ద టాస్క్‌గా మారింది. కవిత రోడ్లెక్కి మైలేజ్ పెంచుకుంటుంటే.. బీఆర్ఎస్ ఇంకా కేవలం ట్వీట్లకే పరిమితమైతే, భవిష్యత్తులో తెలంగాణలో అసలైన ప్రతిపక్ష హోదాను కూడా కవిత కొత్త పార్టీ చేజిక్కించుకునే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముగింపుగా చూస్తే.. అన్న 'డిజిటల్ వాట్సాప్' పాలిటిక్స్ చేస్తుంటే, చెల్లెలు మాత్రం 'రోడ్ పాలిటిక్స్' తో తెలంగాణ అసెంబ్లీ సమీకరణాలను మార్చడానికి దూసుకుపోతున్నారు. ఈ అన్నదమ్ముల, అన్నాచెల్లెళ్ల పొలిటికల్ వార్ రాబోయే రోజుల్లో ఏ మలుపు తిరుగుతుందో చూడాలి.

# గులాబీకి మల్లారెడ్డి గుడ్ బై...

హైదరాబాద్, జూలై 7, తనదైన డైలాగులు, విలక్షణమైన రాజకీయ శైలితో నిత్యం సోషల్ మీడియాలో, ప్రజల్లో హల్‌చల్ చేసే మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర సంచలనంగా మారాయి. తాజాగా ఓ కార్యకర్త జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఆయన, "ఁఖీూకు దూరమయ్యానని నన్ను మర్చిపోతున్నారు" అంటూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. బీఆర్ఎస్ పార్టీకి ఆయన గుడ్ బై చెప్పి, త్వరలోనే భారతీయ జనతా పార్టీ తీర్థం పుచ్చుకోబోతున్నారనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్న తరుణంలో ఈ కామెంట్స్ రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పార్టీ అగ్రనేతల వద్ద అత్యంత కీలక వ్యక్తిగా, పార్టీకి ప్రధాన బలంగా నిలిచిన మల్లారెడ్డి, అధికారం కోల్పోయిన తర్వాత కూడా చాలాకాలంపాటు ఆయన పార్టీలో చురుగ్గా ఉండేవారు. కానీ కొంతకాలంగా అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఆయన పార్టీ ప్రధాన కార్యాలయమైన తెలంగాణ భవన్ వైపు రావడం పూర్తిగా తగ్గించేశారు. కేటీఆర్, హరీశ్ రావు వంటి పార్టీ ముఖ్య నేతలు నిర్వహించే ప్రెస్ మీట్లు, కీలక సమావేశాల్లోనూ మల్లారెడ్డి మునుపటిలా యాక్టివ్‌గా కనిపించడం లేదు. కాంగ్రెస్, బీజేపీ, చివరికి టీడీపీలో చేరేందుకు కూడా ఆయన ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం చాలా రోజులుగా నడుస్తోంది. తాజాగా "నేను బీఆర్ఎస్‌కు దూరమయ్యానని నన్ను దూరం పెడుతున్నారు" అంటూ నేరుగా కార్యకర్తల సమక్షంలో వ్యాఖ్యానించడం.. ఆయన పార్టీ మారడం ఖాయమనే సంకేతాలను ఇస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మల్లారెడ్డి కుటుంబం బీజేపీ వైపు చూస్తోందనడానికి మరో ప్రధాన కారణం.. ఆయన కోడలు డాక్టర్ ప్రీతిరెడ్డి ఇటీవల చేసిన కొన్ని ఆసక్తికర కామెంట్స్ కూడా ఉన్నాయి. ఆమె ఓ ఇంటర్వ్యూలో ప్రధాని నరేంద్ర మోడీపై ప్రశంసలు కురిపించడం పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. అంతేకాకుండా, ఆమె బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి అక్కడ ఆ పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ సహా కీలక నేతలతో భేటీ కావడం చర్చకు దారితీసింది. అయితే, ఇది కేవలం డిజిటల్ ఇండియా ఈవెంట్ గురించిన భేటీ అని, రాజకీయ ప్రాధాన్యత లేదని ఆమె వివరణ ఇచ్చినప్పటికీ ఊహాగానాలు మాత్రం ఆగలేదుప్రస్తుతం మల్లారెడ్డి, ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డి ఇద్దరూ బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారు. అయితే, భవిష్యత్తులో రాబోయే మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనను దృష్టిలో ఉంచుకుని మల్లారెడ్డి ఫ్యామిలీ ఒక పెద్ద స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. తమ కుటుంబానికి రాబోయే రోజుల్లో ఒక పార్లమెంటు నియోజకవర్గంతో పాటు అందులోని నాలుగు అసెంబ్లీ టికెట్లు కేటాయించాలనే షరతుపై అటు బీఆర్ఎస్, ఇటు బీజేపీ అధిష్టానాల నుంచి గట్టి హామీ పొందే ప్రయత్నాల్లో మల్లారెడ్డి ఫ్యామిలీ ఉన్నట్లు పొలిటికల్ కారిడార్‌లో గట్టిగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే మల్లారెడ్డి అత్యంత వ్యూహాత్మకంగా "నన్ను మర్చిపోతున్నారు" అంటూ సానుభూతి కార్డ్ ప్లే చేశారా? లేక నిజంగానే బీఆర్ఎస్ శ్రేణులు తనను దూరం పెట్టడం వల్లే ఆవేదనతో అన్నారా? అనేది తేలాల్సి ఉంది. ఏది ఏమైనా, మల్లారెడ్డి తాజా వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు తెరలేపబోతున్నాయనేది మాత్రం స్పష్టమవుతోంది.

## అక్రమంగా తరలిస్తున్న పొగాకు బేళ్లను పట్టుకున్న విజిలెన్స్ అధికారులు.



జంగారెడ్డిగూడెం పొగాకు బోర్డు విజిలెన్స్ అధికారులకు అందిన ముందస్తు సమాచారం మేరకు, జంగారెడ్డిగూడెం నుండి గుంటూరుకు అక్రమంగా రవాణా అవుతున్న పొగాకు బేళ్లను అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. నమ్మదగిన సమాచారంతో నిఘా ఉంచిన అధికారులు, అనుమానాస్పదంగా వెళ్తున్న ×రెండు ఆటోలను× ఆపి కలపర్రు టోల్ ప్లాజా వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఎలాంటి అనుమతులు (పర్మిట్లు) లేకుండా అక్రమంగా తరలిస్తున్న సుమారు ×32 హై గ్రేడ్ పొగాకు బేళ్లను× గుర్తించి, వాటిని తక్షణమే సీజ్ చేశారు. ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులపై నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి, తదుపరి చర్యల నిమిత్తం సీజ్ చేసిన పొగాకును జంగారెడ్డిగూడెం వేలం కేంద్రానికి తరలించారు.

# ఒవైసీ విద్యా సంస్థలపై రాజకీయ రంగు

హైదరాబాద్, జూలై 7, తెలంగాణలో ఓవైసీల నేతృత్వంలోని ఫాతిమా విద్యాసంస్థల భూముల వ్యవహారం మరోసారి రాజకీయంగా, న్యాయపరంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం, కోర్టుల అక్షింతలు, అధికార-విపక్షాల మధ్య సవాల్-ప్రతిసవాళ్లతో ఈ అంశం రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోంది. నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవడంలో జరుగుతున్న జాప్యంపై హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేయగా, ఈ వ్యవహారం కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం పార్టీల మధ్య పదునైన విమర్శల యుద్ధానికి దారితీసింది. ఫాతిమా విద్యాసంస్థల ఉల్లంఘనలపై విచారణ సందర్భంగా ప్రభుత్వ విభాగాలు కోర్టుకు సమర్పించిన నివేదికలు, చెప్పిన సమాధానాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తాము ఈ సంస్థలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని హైకోర్టుకు స్పష్టం చేసింది. తాము ప్రస్తుతం సర్వే వ్యవహారాల్లో బిజీగా ఉన్నామంటూ కాలయాపన సమాధానం ఇచ్చింది. నివేదిక ఇచ్చేందుకు కొంత గడువు కావాలని కోరింది. చెరువులు, నాలాల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పాటైన హైడ్రా.. ఇతర శాఖల నుంచి స్పష్టమైన నివేదికలు వస్తేనే తాము తదుపరి చర్యలు తీసుకోగలమని వివరించింది. ఒకరిపై ఒకరు నెపం నెట్టేస్తూ, బాధ్యతల నుంచి తప్పుకునేలా ఉన్న ప్రభుత్వ శాఖల తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులు ఇన్నిసార్లు చీవాట్లు పెడుతున్నా, క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని న్యాయస్థానం నిలదీసింది. హైకోర్టు వ్యాఖ్యలను అస్త్రంగా చేసుకుని విపక్షాలు ప్రభుత్వంపై విమర్శల దాడిని పెంచాయి. ముఖ్యంగా బీజేపీ ఈ వ్యవహారాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అక్రమ కట్టడాలపై బుల్డోజర్లు నడుపుతామని చెప్తున్న హైడ్రా, ఫాతిమా విద్యాసంస్థల జోలికి ఎందుకు వెళ్లడం లేదని బీజేపీ ప్రశ్నిస్తోంది. కేంద్రమంత్రి బండి సంజయ్ ఈ వివాదంపై అత్యంత ఘాటుగా స్పందించారు. తాము అధికారంలోకి వస్తే ఓవైసీ విద్యాసంస్థలను కూల్చేస్తామని బహిరంగంగా ప్రకటించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపాయి. దీనికి ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ అంతే దీటుగా కౌంటర్ ఇచ్చారు. "ఒక విద్యాసంస్థను కూల్చితే.. వంద విద్యాసంస్థలను కడతాం" అంటూ సవాల్ విసిరారు. తమ విద్యాసంస్థలను, మైనారిటీల హక్కులను ఎలా కాపాడుకోవాలో తమకు బాగా తెలుసంటూ ఆయన స్పష్టం చేశారుఅక్బరుద్దీన్ ఓవైసీ కామెంట్స్ పై మరో కేంద్రమంత్రి, బీజేపీ నేత కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఓవైసీ సోదరులు బహిరంగంగా ప్రభుత్వాన్ని, చట్టాన్ని బెదిరిస్తున్నా రేవంత్ రెడ్డి సర్కార్ ఎందుకు వెనకడుగు వేస్తోందని ఆయన ప్రశ్నించారు. ఓవైసీ అంటే రేవంత్ రెడ్డికి అంత భయమా అని నిలదీశారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఐఎం అక్రమాలను చూసీచూడనట్లు వదిలేస్తోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఫాతిమా విద్యాసంస్థల వ్యవహారం కేవలం ఒక భూ వివాదంగానే కాకుండా, తెలంగాణ రాజకీయాల్లో ఒక కీలక మలుపుగా మారింది. ఒకవైపు హైడ్రా యాక్షన్‌తో దూసుకుపోతున్నట్లు కనిపిస్తున్నా, ఎంఐఎం నేతలకు సంబంధించిన వ్యవహారాల్లో మాత్రం వెనకడుగు వేస్తోందనే ఇంప్రెషన్ ప్రజల్లో బలంగా కనిపిస్తోంది. ప్రభుత్వ విభాగాలు కోర్టులో పొంతన లేని సమాధానాలు చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనా సామర్థ్యంపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ గ్యాప్‌ను వాడుకుని తెలంగాణలో తామే ప్రధాన ప్రత్యామ్నాయం అని నిరూపించుకునేందుకు బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. కోర్టు తదుపరి ఆదేశాలు ఎలా ఉండబోతున్నాయి? హైడ్రా నిజంగానే చర్యలకు ఉపక్రమిస్తుందా? లేదా ప్రభుత్వ శాఖల మధ్య ఫైళ్ల కదలికల పేరుతో కాలయాపన జరుగుతుందా? అన్నది ఇప్పుడు సస్పెన్స్‌గా మారింది.

# 70 ఏళ్ల జీ హెచ్ ఎంసీ చట్టానికి ఫుల్ స్టాప్

హైదరాబాద్, జూలై 7, తెలంగాణలోని సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మహానగర పాలనలో మార్పులకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో 70ఏళ్ల జీహెచ్ఎంసీ చట్టానికి స్వస్తి చెప్పబోతోంది. మూడు కార్పొరేషన్లు (జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీ) కలిపి కొత్త చట్టాన్ని తీసుకువస్తోంది. ఈ మేరకు క్యూర్ ముసాయిదా బిల్లు (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్) -2026ను ఆదివారం విడుదల చేసింది. ఈ బిల్లులో 43 చాప్టర్లు, తొమ్మిది షెడ్యూళ్లు ఉన్నాయి. జూలై 24 వ తేదీ వరకు ప్రజాభిప్రాయాలు, సూచనలు స్వీకరించనున్నట్లు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి (ఎంఏయూడీ) శాఖ ప్రకటించింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) 2026 ముసాయిదా బిల్లు అమల్లోకి వస్తే హైదరాబాద్ పరిధిలోని ఆస్తి యాజమానులపై పన్నుభారం పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అమలులో ఉన్న వార్షిక అద్దె విలువ విధానానికి బదులుగా, ఆస్తి మూలధన విలువ ఆధారంగా ప్రాపర్టీ ట్యాక్స్ ను నిర్ణయించే విధానాన్ని ప్రభుత్వం ప్రతిపాదించింది. అంతేకాక.. రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వం నిర్ణయించే మార్కెట్ విలువను ఆధారంగా తీసుకొని స్థలాలు, భవనాలపై ఆస్తిపన్ను విధించనున్నారు. దీంతో ముఖ్యంగా పాత జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న అనేక ఆస్తులపై పన్ను గణనీయంగా పెరిగే అవకాశాలు ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఉన్న భవనాలకు పన్ను పెంపును దశలవారీగా అమలు చేసే అవకాశం ఉంది. కొత్తగా నిర్మించే భవనాలకు కొత్త విధానం వెంటనే అమల్లోకి వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్న వివరాల ప్రకారం తెలుస్తోందక్యూర్ ముసాయిదా బిల్లు అమల్లోకి వస్తే.. క్యూర్ పరిధిలో అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు కఠిన చర్యలు చేపడతారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినా.. అందులో ఎవరైనా నివాసం ఉండే పరిస్థితి ఉన్నా.. కమిషనర్లు 24 గంటల ముందు నోటీసులు ఇచ్చి సీజ్ చేయొచ్చు. ఒకవేళ ప్రజల భద్రతకు ఇబ్బందిగా ఉంటే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే సీజ్ చేసే అవకాశం ఉంటుంది. క్యూర్ చట్టంలో పారిశుద్ధ్య నిర్వహణ, ఆరోగ్యానికి ప్రాధాన్యతనిచ్చారు. ఖాళీ స్థలాల్లో చెత్త ఉంటే ప్లాట్ మూలధన విలువలో 0.25శాతం మేర జరిమానా విధిస్తారు. చెత్త తొలగించే వరకు జరిమానాల విధింపు ఉంటుంది. ఈ విధానం ద్వారా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. క్యూర్ చట్టం ముసాయిదాలో ఆహార భద్రతకు సంబంధించి కీలక ప్రతిపాదనలు ఉన్నాయి. కొత్త చట్టంలో అధ్యాయం-33లో ఆహార భద్రత, పోషకాహారం అంశాలను చేర్చారు. దీని ప్రకారం పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి చైర్మన్‌గా, ఫుడ్ సేఫ్టీ కమిషనర్ కన్వీనర్‌గా 'ఆహార భద్రత, పోషకాహార కమిటీ' ఏర్పాటు చేస్తారు. క్యూర్ పరిధిలో ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల అమలును ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. పర్యావరణం పరిరక్షణకూ ఈ క్యూర్ బిల్లులో ప్రాధాన్యత ఇచ్చారు. విపత్తుల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయనున్నారు. ఏదైనా విపత్తు తలెత్తితే ప్రభుత్వ శాఖలను అప్రమత్తం చేయడానికి క్యూర్ స్మార్ట్ గవర్నెన్స్ సెంటర్ ఏర్పాటు చేస్తారు. అంతేకాక హైడ్రాకు చట్టబద్ధ గుర్తింపు కల్పిస్తూ చెరువులు, కాలువలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యతలను పూర్తిస్థాయిలో అప్పగించనున్నారు. క్యూర్ బిల్లులో సెక్షన్ -168 ప్రకారం.. అనుమతిలేని ఆస్తులు, అక్రమ నిర్మాణాల క్రయ విక్రయాలు, బదిలీలు నిషేధం, అనధికార నిర్మాణాల యాజమానులకు సంబంధిత అధికారి నోటీస్ జారీ చేసి నిషేధిత జాబితాలో చేర్చుతారు. ఈ నూతన బిల్లు ద్వారా నైట్ ఎకానమీకి ప్రోత్సాహం అందించే కీలక ప్రతిపాదన చేశారు. పలు ప్రాంతాలను నైట్ ఎకానమీ జోన్లుగా ప్రకటించి రాత్రంతా వ్యాపారాలకు అనుమతి ఇవ్వనున్నారు. క్యూర్‌లోని ప్రజలకు అన్ని అత్యవసర సేవలకు ఒకే ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులోకి తెస్తారు. క్యూర్ బిల్లును ప్రజా సంప్రదింపుల కోసం అందుబాటులో ఉంచినట్లు ప్రభుత్వం తెలిపింది. పౌరులు తమ అభిప్రాయాలు, సూచనలను ఆన్‌లైన్ ద్వారా (ష్ట్రబిబిజూబ://ఐష్ట్రఎఇ.ఐనీల.తిని/ఇజీబివఐనీతీఎచితిబవ ఎనిబవతీబిఖీవజూనీతీబి.జీబజూలీ) సమర్పించాలని పేర్కొంది. మూడు కార్పొరేషన్ల వెబ్ సైట్లలో ముసాయిదా బిల్లును అందుబాటులో ఉంచినట్లు తెలిపింది. రాతపూర్వకంగా కూడా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ, సచివాలయం, హైదరాబాద్‌కు తమ సూచనలను పంపొచ్చని ప్రభుత్వం తెలిపింది. అయితే, ఈ సూచనలు, అభ్యంతరాలను కేవలం జులై 24వ తేదీ వరకు మాత్రమే స్వీకరించటం జరుగుతుందని ప్రభుత్వం ప్ట్నం చేసింది.

# తెలంగాణ కాంగ్రెస్లో మరో అలజడి



హైదరాబాద్ తెలంగాణ కాంగ్రెస్ లో మరోసారి అలజడి బయటపడింది. మంత్రి కొండా సురేఖకు తెలియకుండా దేవాదాయ శాఖ కమిషనర్తో కడియం శ్రీహరి ఎండోమెంట్ రివ్యూ నిర్వహించారు. స్టేషన్ఘన్పూర్ పరిధిలోని ఆలయాల పరిస్థితులపై హైదరాబాద్లో కడియం శ్రీహరి రివ్యూ నిర్వహించారు. దేవదాయ శాఖ మంత్రినైన తనకే తెలియకుండా కడియం శ్రీహరి రివ్యూ చేయడంపై మంత్రి కొండా సురేఖ తీవ్ర అభ్యంతరం తెలిపినట్లు సమాచారం. కడియం శ్రీహరిపై స్టేట్ కమాండ్కి కాకుండా నేరుగా హైకమాండ్కి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మరోవైపు, తనకు చెప్పకుండా హైకమాండ్కి మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు చేయడంపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరా తీసారు. హైకమాండ్కు రాసిన లేఖను బహిర్గత పరచొద్దని మంత్రి కొండా సురేఖకు మహేష్ కుమార్ గౌడ్ సూచించారు.

# బీటెక్ ఉద్యోగుల జీతాల మించి శానిటరీ ఉద్యోగుల జీతాలే...

హైదరాబాద్, జూలై 7, హైదరాబాద్ మహానగరపాలక సంస్థ ఐటీ నిపుణుల కొరతను తీర్చేందుకు జారీ చేసిన ఒక టెండర్ నోటిఫికేషన్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నగరంలో ఎంతో నైపుణ్యం కలిగిన ఐటీ ఉద్యోగులకు ఆఫర్ చేస్తున్న వేతనాలు శాశ్వత శానిటేషన్ కార్మికుల జీతాల కంటే చాలా తక్కువగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. జీహెచ్ఎంసీ ఒక సంవత్సరం కాల పరిమితిపై ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 25 మంది ఐటీ ప్రొఫెషనల్స్‌ను నియమించుకోవడానికి తాజాగా నోటిఫికేషన్ రిలీజ్ చేసింది. అయితే ఇందులో ప్రతిపాదించిన పే స్కేల్ ప్రస్తుతం హాట్ టాఫిక్‌గా మారింది. ఈ అధికారిక నోటిఫికేషన్ ప్రకారం.. హార్డ్‌వేర్ ఇంజనీర్లు, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్లు, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్లు, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్లు, ప్రోగ్రామర్లు, టీమ్ లీడర్లు, జీఐఎస్ అనలిస్ట్‌లు, వెబ్ డిజైనర్ల వంటి వివిధ విభాగాల నిపుణుల కోసం జీహెచ్ఎంసీ దరఖాస్తులను కోరింది. అయితే వీరికి కేటాయించిన వేతనాల వివరాలు గమనిస్తే.. 12 మంది హార్డ్‌వేర్ ఇంజనీర్ల పోస్టులకు నెలకు రూ. 28 వేల చొప్పున వేతనం ప్రతిపాదించారు. కనీసం మూడేళ్ల అనుభవంతో పాటు ఎంటెక్ ఉన్నత విద్యార్హత కలిగిన సీనియర్ జీఐఎస్ అనలిస్ట్‌కు నెలకు రూ. 37 వేలు మాత్రమే చెల్లించనున్నారు. బీటెక్ విద్యార్హతతో పాటు ఆరు సంవత్సరాల సుదీర్ఘ అనుభవం గల వెబ్ డిజైనర్ పోస్టుకు కేవలం రూ. 42 వేలు వేతనంగా నిర్ణయించారు. ఈ వేతన ప్యాకేజీలను జీహెచ్ఎంసీలోని శానిటేషన్ కార్మికుల జీతాలతో పోల్చి చూస్తే ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగుచూశాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధుల సమాచారం ప్రకారం.. జీహెచ్ఎంసీలో కొత్తగా చేరే శానిటేషన్ కార్మికులకే (ఔట్ సోర్సింగ్ కాకుండా) ప్రారంభంలో నెలకు రూ. 30 వేల నుంచి రూ. 35 వేల వరకు వేతనం అందుతోంది. ఇక కార్పొరేషన్‌లో శాశ్వత ప్రాతిపదికన పనిచేస్తున్న సీనియర్ శానిటేషన్ కార్మికులు తమ సర్వీసు కాలాన్ని బట్టి నెలకు రూ. 50 వేల నుంచి గరిష్టంగా రూ. 80 వేల వరకు జీతాలు అందుకుంటున్నారు. విద్యా అర్హతలతో సంబంధం లేకపోయినా సీనియారిటీ కారణంగా వారి జీతాలు ఐటీ ఉద్యోగుల కంటే ఎంతో మెరుగ్గా ఉన్నాయి. ఈ తక్కువ వేతనాల వ్యత్యాసంపై జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పందిస్తూ.. ఐటీ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి గత ఐదేళ్లుగా ఎలాంటి పే-స్కేల్ సవరణలు జరగకపోవడమే దీనికి ప్రధాన కారణమని వివరించారు. ప్రభుత్వం 2022 సంవత్సరం నుంచి ఔట్‌సోర్సింగ్ ఐటీ పోస్టులకు సంబంధించి పీఆర్సీ నిబంధనలను అమలు చేయకపోవడంతో పాత జీతాలనే కొనసాగించాల్సి వస్తోందని పేర్కొన్నారు. కాగా, ఇలా తక్కువ జీతాలు పొందుతున్న ఐటీ ఉద్యోగులు జీహెచ్ఎంసీలో సాఫ్ట్‌వేర్ వెబ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, సర్వర్లు, డెస్క్‌టాప్‌లు, ప్రింటర్ల నిర్వహణతో పాటు మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ విభాగానికి సలహాలు అందించడం వంటి కీలక సాంకేతిక బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

# ఆహార కల్తీ నియంత్రణకు హైడ్రా తరహా చట్టం

హైదరాబాద్, జూలై 7, తెలంగాణలో ఆహారకల్తీ, డ్రగ్స్ నివారణకు ప్రభుత్వం కొత్తగా ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయనుంది. సీఎస్ సంజయ్‌జాజు, డీజీపీ సీవీ ఆనంద్‌ల సమీక్షలో ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ విభాగాలను ఒకే గొడుకు కిందకు తెస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ కొత్త శాఖకు ఒకే విభాగాధిపతి ఉంటారు. దీని పరిధిలోనే ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎఫ్ఎస్ఎల్, ప్రాసిక్యూషన్ విభాగాలు పనిచేస్తాయి. కల్తీ ముఠాలపై ఉక్కుపాదం మోపేందుకు గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల నుంచి వెనక్కి వచ్చిన సిబ్బందిని ఈ కొత్త విభాగంలోకి పంపించనున్నారు. తెలంగాణలో ఆహారకల్తీ అతి పెద్ద సమస్యగా మారింది. వంటింటి సామాన్ల నుంచి పిల్లలు తినే చాక్లెట్లు, బిస్కెట్ల వరకు ప్రతిదీ కల్తీ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఈ నేపథ్యంలో కల్తీని పూర్తిగా అణచివేసేందుకు తెలంగాణ ప్రభుత్వం వ్యూహాత్మక కార్యాచరణను ప్రారంభించింది. ఆహారకల్తీ నియంత్రణ కోసం కొత్తగా ప్రత్యేక శాఖ లేదా విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది.

ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు.

ప్రస్తుతం విడివిడిగా కొనసాగుతున్న ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ విభాగాలను ఒకే గొడుకు కిందకు తీసుకురానున్నారు. ఈ రెండు కీలక విభాగాలనూ విలీనం చేస్తూ ఏర్పడే ఈ కొత్త సూపర్ విభాగానికి ఒకే ఒక సమర్థుడైన విభాగాధిపతి నేతృత్వం వహించేలా తగిన అధికారిక చర్యలు తీసుకుంటున్నారు. ఆహార, ఔషధ రంగానికి చెందిన నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఉక్కుపాదం మోపేలా.. ఈ సరికొత్త శాఖ పరిధిలోనే ప్రత్యేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్, లీగల్ సెల్, ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ ల్యాబ్స్, పటిష్టమైన ప్రాసిక్యూషన్ విభాగాలను కూడా అంతర్భాగంగా ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. మరోవైపు.. రాష్ట్రంలో యువత భవిష్యత్తును బుగ్గిపాలు చేస్తున్న మాదకద్రవ్యాల కేసులను, అక్రమ రవాణాను సమూలంగా అరికట్టేందుకు కూడా ఈ శాఖ అత్యంత చురుగ్గా పనిచేస్తుందని ఉన్నతాధికారుల బృందం భావిస్తోంది. ఈ కొత్త రక్షణ విభాగానికి అత్యంత నైపుణ్యం కలిగిన బలగాల దళాన్ని కేటాయించనున్నారు.

ఇందులో భాగంగానే ఇటీవలే ఎలైట్ యాంటీ-నక్సల్ ఫోర్స్ అయిన గ్రేహౌండ్స్, ఉగ్రవాద నిరోధక విభాగం ఆక్టోపస్‌ల నుంచి వెనక్కి పిలిపించిన అనుభవజ్ఞులైన పోలీసు సిబ్బందిని, కమాండోలను కొత్తగా ఏర్పాటు చేయబోయే ఈ ప్రతిష్టాత్మక ప్రత్యేక శాఖలోకి బదిలీ చేసేందుకు పరిపాలనాపరంగా రంగం సిద్ధం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు, తయారీ కేంద్రాలలో నాణ్యతా ప్రమాణాలను పర్యవేక్షించడంతో పాటు, నకిలీ మందుల ముఠాల గుట్టు రట్టు చేయడానికి ఈ కమాండో తరహా నిఘా విభాగం పగడ్బందీగా పనిచేయనుంది.

అంతర్గత కసరత్తులన్నీ దాదాపు తుది దశకు చేరుకున్నందున త్వరలోనే ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ఈ సరికొత్త ఆహార, ఔషధ నియంత్రణ ప్రత్యేక శాఖ అధికారికంగా అందుబాటులోకి రానుందని అధికారులు వెల్లడించారు.

# విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## తిలక్ పాఠశాలలో మిడ్‌డే మీల్స్‌ను ఆకస్మికంగాతనిఖీ చేసిన ఎమ్మెల్యే అరవింద బాబు



నరసరావుపేట పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లో ఉన్న తిలక్ ప్రభుత్వ పాఠశాలలో మిడ్‌డే మీల్స్ (మధ్యాహ్న భోజన పథకం) అమలును స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా పాఠశాలలోని భోజనాల గది, నిల్వ గదులను పరిశీలించి, ఆహార పదార్థాల నాణ్యత, భద్రత, నిల్వ విధానాలపై ఆరా తీశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టిక ఆహారం అందుతున్నదని నిర్ధారించుకున్న అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేసి, భోజనం గురించి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న కొత్త పాఠశాల యూనిఫామ్‌లను ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాలలో ఇటీవల ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను కూడా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పి-4 విధానంలో దాతల సహకారంతో అదనపు కంప్యూటర్లు, ఫర్నిచర్, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించే అంశాలపై పాఠశాల నిర్వహణ కమిటీతో ఎమ్మెల్యే వివరణాత్మకంగా చర్చించారు. త్వరలోనే అన్ని వసతులతో కూడిన ఆధునిక కంప్యూటర్ ల్యాబ్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు ఇన్‌చార్జి భూమిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు కపిలవాయి విజయ్ కుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్తా, మెహర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# దూలపల్లిషాపూర్ రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

మేడ్చల్ దూలపల్లి: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దూలపల్లి నుంచి షాపూర్ వరకు రోడ్డు విస్తరణ పనులను మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ ప్రారంభించారు. దూలపల్లి 289 డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బైరి భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ రహదారికి శిలాఫలకం ఏర్పాటు చేసినప్పటికీ దాదాపు పదేళ్లుగా పనులు ప్రారంభం కాలేదని విమర్శించారు. కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్ బైరిభాస్కర్గౌ డ్ తన దృష్టికి ఈ సమస్యను తీసుకురావడంతో కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్చార్జిగా రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుతో మాట్లాడి రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు అవసరమైన ప్రతి విషయంలో తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, బైరి భాస్కర్ గౌడ్, జెమీ భాస్కర్, కావలి మోహన్, నగేష్, బొబ్బ రంగారావు, చాంద్ పాషా, బూసిరెడ్డి వాణి, నాగలక్ష్మి, బుచ్చిరెడ్డి, మధు మోహన్ తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హైకోర్టు న్యాయమూర్తి రఘునందన్ రావు గొప్ప మానవతావాది, గొప్ప న్యాయమూర్తి : హైకోర్టు జస్టిస్ బట్టు దేవానంద్ యాంకర్

విజయవాడ జస్టిస్ రఘునందన రావు గోప్ప న్యాయమూర్తి అని హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవానంద్ అన్నారు. విజయవాడ లబ్బీపేట పేటలో ఓ హోటల్ లో జస్టిస్ రఘు నందన్ పదవి విరమణ సందర్భంగా ఫేర్ వెల్ ఫంక్షన్ ను ఆంధ్రప్రదేశ్ టాక్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జస్టిస్ రఘునందన్ రావు వీడ్కోలు సభను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ న్యాయమూర్తిగా రఘునందన రావు సేవలు ప్రశంసనీయని అన్నారు. న్యాయవాదిగా, ఆయన ఇచ్చిన తీర్పులు సరళంగా ఉండేవని అన్నారు. . ఆయన మంచి న్యాయూర్తిగా అనేక యువ న్యాయూర్తులకు మార్గదర్శిగా ఉన్నారని పేర్కొన్నారు. అనంతరంన్యాయముర్తి హరినాథ్ మాట్లాడుతూ అందరికి వెన్నుముకగా సివిల్, క్రిమినల్ లో ఆయన దిట్ట అని అన్నారు. ఆయన వ్యక్తి గతంగా ఎందరికో జడ్జీలకు అండగా నిలిచారని కొనియాడారు. అనంతరం ముఖ్య అతిథి రఘునందన రావు మాట్లాడుతూ ఎపి ట్యాక్స్ అసోసియేషన్ వారికి సహకారం అందించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# 40 లక్షల రూపాయల విలువైన 196 మొబైల్ ఫోన్లను రికవరీ చేసాం : జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల జిల్లాలో 40 లక్షల రూపాయల విలువైన 196 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ తెలిపారు. బాపట్ల జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో బాధితులకు మొబైల్ ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 6 విడతలుగా 2.64 కోట్ల రూపాయల విలువైన 1321 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామని తెలిపారు. చోరీకి గురైన మొబైల్ ఫోన్లలో 71 శాతం రికవరీ చేశామని తెలిపారు. పాత మొబైల్ ఫోన్లను ఎవరూ కొనుగోలు చేయవద్దని, ఒకవేళ కొంటే బిల్లులు చూసి కొనుగోలు చేయాలని సూచించారు

# ప్రధాని నరేంద్ర మోడీ 12 ఏళ్ల సుపరిపాలనను పురస్కరించుకుని అర్షముక్త భారత్ కార్యక్రమం నిర్వహించిన యువమోర్చా

విశాఖపట్నంలో 'అర్షముక్త భారత్' కార్యక్రమాలపై భారతీయ జనతా యువమోర్చా (ఃఏజఓ) ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహించారు. విశాఖ నగరంలో మద్దిలపాలెం అటఖీ సెంట్రల్ సమీపంలో రామాచారి రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో యువ సారధ్యం పేరుతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 ఏళ్ల సుపరిపాలనను పురస్కరించుకుని ఃఏజఓ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. ఇందులో భాగంగా యువతకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, డిజిటల్ ఇండియా తదితర అంశాలపై వివరించడం జరిగింది.

# క్యాన్సర్ పరీక్షా శిబిరాన్ని ప్రారంభించిన తలసాని

హైదరాబాద్ ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ఉత్తమమని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం సనత్ నగర్ లోని సెవెన్ టెంపుల్ ఆవరణలో మాతా సేవా సమితి, రోటరీ క్లబ్, ఓఔఏ క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ వ్యాధిని గుర్తించేందుకు ఉపయోగించే అత్యాధునిక పరికరాల పనితీరు గురించి వైద్యులు వివరించారు. అదేవిధంగా క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం ఉపయోగించే వాహణంలోకి వెళ్ళి పరిశీలించారు. అనంతరం శిబిరంలో సేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి శిభిరాలను సద్వినియోగం చేసుకొని పరీక్షలు చేయించుకోవడం వలన ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. చాలామంది సరైన అవగాహన లేక చివరి స్టేజీలో వైద్యం కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేసిన ఫలితం లేకుండా పోతుందని విచారం వ్యక్తం చేశారు. శిభిరాలలో క్యాన్సర్ లక్షణాలు గుర్తిస్తే ప్రారంభంలోనే వైద్యుల సూచనలతో నివారణకు అవసరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ వ్యాధికి వైద్యం ఎంతో ఖర్చుతో కూడుకున్నదని, ఆర్ధికంగా కుటుంబాలను ఎంతో కుంగదీస్తుందని చెప్పారు. ఈ శిబిరంలో ఎవరైనా క్యాన్సర్ బారిన పడినట్లు గుర్తిస్తే ఓఔఏ క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా ఉచితంగా వైద్యం తో పాటు అవసరమైన మందులు కూడా అందించడం జరుగుతుందని వైద్యులు తెలిపారు. ముందుగా ఆలయ పండితులు రవిశర్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు.

## బంగారు పతకాలు సాధించిన ఎన్‌సీసీ విద్యార్థులు



చిట్వేలి లోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించిన ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ -1 శిబిరంలో అసాధారణ ప్రతిభ కనబరిచి బంగారు, రజత పతకాలు సాధించి పాఠశాలకు విశేష గౌరవాన్ని తీసుకువచ్చారు. గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీలో జూన్ 24 నుండి జూలై 5 వరకు 12 రోజులపాటు నిర్వహించిన ఈ జాతీయ స్థాయి శిబిరంలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు, ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్ మాట్లాడుతూ శిబిరంలో భారతదేశ వైవిధ్యభరిత సంస్కృతులు, భాషలు, సంప్రదాయాలపై అవగాహన కల్పించడంతో పాటు జాతీయ సమైక్యత, సోదరభావం, పరస్పర గౌరవం, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం, జాతీయ సమగ్రత వంటి అంశాలపై సమగ్ర శిక్షణ అందించారని తెలిపారు. దేశ సమైక్యతను ప్రతిబింబించే ఈ శిబిరంలో నిర్వహించిన క్విజ్, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు, చిత్రలేఖనం, సమూహ కార్యకలాపాలు తదితర విభాగాల్లో పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ క్యాడెట్లు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. అవుల రమ్య, కొండప్పగారి దీక్ష, పిట్ట భరత్ బంగారు పతకాలు, సాయి సుజిత్ రెడ్డి రెండు రజత పతకాలు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ శిబిరంలో మరో ఇద్దరు క్యాడెట్లు జయప్రకాష్ ,లక్ష్మయ్య లు పాల్గొన్నారు. ఈ విజయంపై ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు, ఎన్‌సీసీ అధికారి పసుపుల రాజశేఖర్ హర్షం వ్యక్తం చేస్తూ, క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర సాధన, జాతీయ సమైక్యత పట్ల ఉన్న నిబద్ధతే విద్యార్థులను ఈ స్థాయికి చేర్చిందని అన్నారు. ఎన్సిసి క్యాడెట్లకు సాధించిన పథకాలు, ధృవపత్రాలు, ప్రత్యేక ఈబిఎస్‌బి క్యాప్ లు , బ్యాడ్జెస్ ను అందించారు.

# బద్వేల్ టిడిపి ఇన్చార్జి ఇక లాంచనమే.

**డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డికి టిడిపి ఇన్చార్జి ఖాయం?**

**ఇంచార్జ్ పదవి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దాదాపు నిర్ణయం**

**బద్వేలు మాజీ మంత్రి దివంగత వీరారెడ్డి కుటుంబం నుంచి పగ్గాలు పోయినట్లే ?**



బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జిగా డీసీసీబీ చైర్మన్ మంజూరు సూర్యనారాయణ రెడ్డి ఇక లాంచనమే అని చెప్పాలి సూర్యనారాయణ రెడ్డికి బద్వేల్ టిడిపి పగ్గాలు ఇచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేష్ దాదాపు ఒక నిర్ణయానికి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. గడచిన ఐదు అసెంబ్లీ ఎన్నికల్లో బద్వేల్ అసెంబ్లీలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఓడిపోవడం జరిగింది ఇప్పటి బద్వేలు టిడిపి ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పార్టీ సమన్వయకర్త విజయమ్మ కుమారుడు రితేష్ రెడ్డి నియోజకవర్గంలో పార్టీని నడిపించడంలో చాలావరకు విఫలమయ్యారని అధిష్టానం గుర్తించింది తాజాగా గత శనివారం జరిగిన ముఖ్యమంత్రి సమావేశానికి కడప జిల్లా నుండి అందరూ ఎమ్మెల్యేలు పార్టీ ఇన్చార్జిలు హాజరయ్యారు కానీ బద్వేల్ నుంచి విజయమ్మ రితీష్ రెడ్డిలు హాజరు కాలేదు కారణం వారికి పిలుపు లేకపోవడమే సమావేశం జరుగుతున్న విషయం కూడా వారికి తెలియలేదు విజయమ్మ ఆమె తండ్రి దివంగత మాజీ మంత్రి వీరారెడ్డి మృతి చెందిన తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించలేకపోయింది ఒకప్పుడు బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉంది వీరారెడ్డి మృతి చెందిన తర్వాత ఆ వైభవం లేకుండా పోయింది 2009 నుంచి బద్వేలు అసెంబ్లీ రిజర్వ్ అయింది రిజర్వ్ అయిన తర్వాత తాజాగా 2024 ఎన్నికల వరకు తెలుగుదేశం పార్టీ ఓడిపోతూనే వస్తుంది 2024ఎన్నికల్లో మాజీ ఇరిగేషన్ అధికారి రోశన్న బిజెపి అభ్యర్థిగా పోటీ చేశారు తెలుగుదేశం పార్టీ జనసేన బిజెపి ఆయనకు పూర్తి మద్దతు ఇచ్చిన ఫలితం లేకుండా పోయింది 2024 ఎన్నికల్లో కూటమి హావ రాష్ట్రమంతా వీచిన బద్వేల్ లో మాత్రం వైసీపీ అభ్యర్థి విజయం సాధించారు కడప జిల్లాలో వైసిపి పాగా వేయకుండా చూడాలని ముఖ్యమంత్రి గట్టిగా నిర్ణయించారు అందులో భాగంగా బద్వేల్ లో టిడిపి ఇంచార్జ్ మార్పు కోసం ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు తెలిసింది బద్వేలు నియోజకవర్గంలోని అట్లూరు మండలం వేమలూరు గ్రామానికి చెందిన ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ ప్రస్తుత డీసీసీబీ చైర్మన్మంచూరు సూర్య నారాయణ రెడ్డి ని బద్వేలు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జిగా నియమించేందుకు అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం శనివారం జరిగిన కడప జిల్లా పార్టీ ఎమ్మెల్యేల వద్ద బద్వేలు నియోజకవర్గ విషయంపై ప్రత్యేకంగా మాట్లాడినట్లు సమాచారం క ఇది ఇలా ఉండగా సూర్యనారాయణ రెడ్డికి డీసీసీబీ చైర్మన్ పదవి రావడంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఆమె కుమారుడు రితీష్ రెడ్డి ప్రమేయం ఏమాత్రం లేదని పార్టీలోని వారు చెపుతుంటారు ప్రస్తుతం పార్టీ సమన్వయకర్త రితీష్ రెడ్డి పార్టీ నడిపించడంలో విఫలమయ్యారని ఆరోపణలు ఉన్నాయి అంతేకాక వైసీపీలోని చాలామందితో ఆయనకు మంచి సంబంధం ఉన్నట్లు అధిష్టానానికి లెక్కలేనన్ని ఫిర్యాదులు అందాయి ఇది కూడా మైనస్ గా మారింది నియోజకవర్గంలోని గ్రూపులు కట్టడి చేయడంలో రితీష్ రెడ్డి విఫలమైనట్లు పార్టీ అధిష్టానం గుర్తించింది అందుకే శనివారం జరిగిన సమావేశానికి విజయమ్మ రెడ్డిలకు రాలేదు. సూర్యనారాయణరెడ్డి విజయమ్మ రితీష్ రెడ్డిలమధ్య గత ఏడు నెలలుగా తగాదాలు ఉన్నాయిరోజురోజుకు ఈ విభేదాలు మరింతగా పెరిగిపోయాయి ఈ నేపథ్యంలో టిడిపి ఇన్చార్జిగా సూర్యనారాయణ రెడ్డికి అవకాశం ఇవ్వాలని పార్టీ అధిష్టానం దాదాపుగా ఒక నిర్ణయానికి వచ్చింది. ఇక్కడ ఒక విషయం చెప్పాలి దివంగత మంత్రి వీరారెడ్డి పార్టీకి ఎంతో సేవలందించారు బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా చేశారు ఆయన చనిపోయిన తర్వాత ఆ వైభవం ఇప్పుడు లేకుండా పోయింది. బద్వేల్ నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ వరుసగా ఓడిపోవడం పార్టీ అధిష్టానం చాలా సీరియస్ గా తీసుకుంది. అందులో భాగంగానే పార్టీ ఇన్చార్జి మార్చాలని నిర్ణయించారు. డీసీసీబీ చైర్మన్ మంజూరు సూర్యనారాయణ రెడ్డి కి ఇంచార్జ్ పగ్గాలు ఇచ్చేందుకు అధిష్టానం దాదాపుగా నిర్ణయించింది మృదు స్వభావి అందర్నీ కలుపుకు వెళ్లే సూర్యనారాయణ రెడ్డి అయితేనే బద్వేల్ నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీకి న్యాయం జరుగుతుందని అధిష్టానం నిర్ణయించింది ఇంచార్జ్ పగ్గాలు చ చేపట్టేందుకు సూర్యనారాయణ రెడ్డి సుముఖంగా ఉన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధి పనులకు సహకరించాలని ముఖ్యమంత్రిని కోరిన

# ఎమ్మెల్యే అరవింద బాబు



నరసరావుపేట, :నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరసరావుపేట నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన వివిధ ప్రతిపాదనలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన నిధులను మంజూరు చేసి సహకరించాలని కోరారు. ఇప్పటికే నియోజకవర్గంలో ప్రతిపాదనల దశలో ఉన్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే ముఖ్యమంత్రికి వివరించారు. ముఖ్యంగా ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు, ఆటోనగర్ నిర్మాణం, కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి, గ్రామీణ రహదారుల అభివృద్ధి, నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన మౌలిక సదుపాయాల విస్తరణతో పాటు పలు పైలట్ ప్రాజెక్టుల గురించి సమగ్రంగా వివరించినట్లు తెలిసింది. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ఈ ప్రాజెక్టులు కీలకమని, వీటి అమలుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం అవసరమని ఎమ్మెల్యే ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## టీఆర్ఎస్ పార్టీ పేరుపై కవితకు ఢిల్లీ హైకోర్టులో ఊరట




హైదరాబాద్ తెలంగాణ రక్షణ సేన పార్టీ పేరు కేటాయింపు వివాదంలో కల్వకుంట్ల కవితకు ఢిల్లీ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. టీఆర్ఎస్ పేరును కేటాయించడం సాధ్యం కాదంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఏడాది మే 12, జూన్ 23 న నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీనిపై వారం రోజుల్లో సమాధానం ఇవ్వడానికి కవితకు అవకాశం కల్పిస్తూ ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంలో ఎన్నికల సంఘం నోటీసులకు ఇప్పటివరకు స్పందించని కవిత నేరుగా మంగళవారం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం వారం రోజుల్లో కవిత తన అభిప్రాయాలను తెలిపిన తర్వాత వ్యక్తిగతంగానూ ఆమె వాదనలు విని తుది నిర్ణయం తీసుకోవాలని ఈసీకి హైకోర్టు సూచించింది. విచారణ సందర్భంగా ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది కీలక అంశాలను కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికే టీఆర్ఎస్ పేరుతో పోలిక ఉన్న రెండు రాజకీయ పార్టీలు నమోదై ఉన్నందున అదే పేరును కవితకు కేటాయించడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. అంతేకాకుండా టీఆర్ఎస్ పేరుపై వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చాయని, గతంలో ఇలాంటి వ్యవహారాల్లో ఎవరికీ వ్యక్తిగతంగా వాదనలు వినడానికి అవకాశం ఇవ్వలేదని కోర్టుకు వివరించారు. టీఆర్ఎస్ పేరును కేటాయించడం సాధ్యం కాదని ఇప్పటికే కవితకు స్పష్టం చేసినట్లు ఈసీ తరఫు న్యాయవాది తెలిపారు. మరోవైపు కవిత తరఫు న్యాయవాది మాత్రం టీఆర్ఎస్ పేరును ఆమెకు కేటాయించాలని కోర్టులో వాదనలు వినిపించారు. ఎన్నికల సంఘం జారీ చేసిన నోటీసుల నేపథ్యంలో కవితకు వాదనలు వినిపించే అవకాశం ఇవ్వకుండానే ప్రతికూల నిర్ణయం తీసుకోవడం సముచితం కాదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇరు పక్షాల వాదనలు విన్న ఢిల్లీ హైకోర్టు వారం రోజుల్లో కవిత అభిప్రాయాలను తెలిపిన తర్వాత వ్యక్తిగతంగానూ ఆమె వాదనలు విని తుది నిర్ణయం తీసుకోవాలని ఈసీకి ఢిల్లీ హైకోర్టు సూచించింది.

# కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ ప్రారంభం: సీపీ గౌష్ ఆలం






కరీంనగర్ తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో 3వ జోనల్ లెవల్ పోలీస్ డ్యూటీ మీట్?2026 జూలై మంగళవారం, నేడు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించబడుతున్నాయని సీపీ తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ. ఈ డ్యూటీ మీట్‌లో జోన్-3 పరిధిలోని కరీంనగర్, సిద్ధిపేట, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన మొత్తం 91 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నారన్నారు. యూనిట్ వారీగా కరీంనగర్ నుంచి 24 మంది, సిద్ధిపేట నుంచి 19 మంది, రాజన్న సిరిసిల్ల నుంచి 21 మంది, కామారెడ్డి నుంచి 13 మంది, మెదక్ నుంచి 14 మంది హాజరవుతున్నారని తెలిపారు. ఈ డ్యూటీ మీట్ పోలీసు సిబ్బందిలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించడం, శాస్త్రీయ దర్యాప్తు పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సమర్థవంతమైన సేవల అందింపులో మరింత నైపుణ్యం సాధించేందుకు వేదికగా నిలవనుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా శాస్త్రీయ దర్యాప్తు యాంటీ సబోటేజ్ చెక్, డాగ్ స్క్వాడ్ పోటీలు, కంప్యూటర్ అవగాహన, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ అంశాల్లో పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని మల్టీ జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారని సీపీ తెలిపారు. పోటీల్లో విజేతలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకాల ప్రకారం బంగారు పతక విజేతలకు రూ.3 లక్షలు, మూడు అడ్వాన్స్ ఇన్‌క్రిమెంట్లు, వెండి పతక విజేతలకు రూ.2 లక్షలు, రెండు అడ్వాన్స్ ఇన్‌క్రిమెంట్లు, కాంస్య పతక విజేతలకు రూ.1 లక్ష, ఒక అడ్వాన్స్ ఇన్‌క్రిమెంట్ అందజేయబడతాయి. అలాగే జట్టు విజేతలకు నగదు ప్రోత్సాహకాలు కూడా అందజేయనున్నారని అన్నారు. ఈ డ్యూటీ మీట్‌ను కేవలం పోటీగా కాకుండా వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకునే అవకాశంగా భావించి, క్రమశిక్షణ, అంకితభావం, సేవా తత్వంతో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు. ఈ డ్యూటీ మీట్ ద్వారా పోలీసు శాఖలో సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం, సమన్వయం మరింత బలోపేతమై ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు శ్రీనివాస్ జి, వేణుగోపాల్, వెంకటస్వామి, ఇతర జిల్లాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షాల కోసం శ్రీ మరికంబా దేవి, రామక్కా అవ్వా దేవి 101 బిందెలతో అభిషేకం



కౌతాళం వర్షాలు లేక రైతులు ఎండి పోయే పంట పొలాలను చూస్తూ ఉక్కిరి బిక్కిరి అవుతున్నరు. వేలల్లో పెట్టుబడి పెట్టి విత్తనాలు నాటక భయం తో ఆందోళన చెందుతున్నారు మంగళవారం కౌతాళం మండలంలో వెలిసిన శ్రీ మారికాంబ దేవి. రమక్క అవ్వా దేవి పాదాలకు 101 బిందె నీళ్లు పోసి అభిషేకంలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు వచ్చి పంట పొలాలు పండాలని గ్రామ పెద్దలు ప్రజలు ప్రత్యేక పూజలు చేసి టెంకాయలు పిండివంటలు సమర్పించారు.

# విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



నరసరావుపేట, పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలంలో కొత్తపల్లి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాధమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం నోటు పుస్తకాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. నరసరావుపేటకు చెందిన కృష్ణవేణి డిగ్రీ కాలేజీ డైరెక్టర్ కోమటినేని నాసరయ్య 15వేల రూపాయలు విలువ చేసే నోటు పుస్తకాలు, పలకలు, పెన్సిల్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ప్రాధమిక విద్య నుండి ఉపాధ్యాయులు చెప్పిన విద్యాబోధనలను శ్రద్ధగా విని, బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భీష్మారావు, విశ్రాంత ఉపాధ్యాయులు కోమటినేని వెంకటేశ్వర్లు, నవచైతన్య, ఉపాధ్యాయులు మల్లిఖార్జునరావు, ఇమామ్ ఖాశిం సైదులు , శ్రీ లక్ష్మి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# రూ.3 లక్షలతో 16 సీసీటీవీ కెమెరాల ఏర్పాటు

## గోవింద్‌పూర్‌లో 'నేను సైతం' కార్యక్రమం




**జహీరాబాద్, జూలై 7 ప్రజాబలం ప్రతినిధి :** సంగారెడ్డి జిల్లా చిరాగ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గోవింద్‌పూర్ గ్రామంలో గ్రామపంచాయతీ నిధులతో 'నేను సైతం' కార్యక్రమంలో భాగంగా రూ.3 లక్షల వ్యయంతో 16 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. జహీరాబాద్ డి.ఎస్.పి సైదా, పట్టణ సీఐ శివలింగం సీసీటీవీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతాభావం పెంపొందుతుందని తెలిపారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరిస్తూ తమ గ్రామాలను సురక్షితంగా తీర్చిదిద్దేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 'నేను సైతం' కార్యక్రమం ద్వారా ప్రజల భాగస్వామ్యంతో భద్రతా చర్యలు మరింత






బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. అనంతరం ద్విచక్ర వాహనదారులకు 30 హెల్మెట్లను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రామంలో మొక్కలు నాటారు. గ్రామంలో భద్రతా చర్యల బలోపేతానికి కృషి చేసిన సర్పంచ్ కవిత వెంకట్‌ను ఎస్‌డీపీఓ, సీఐ అభినందించారు.

ఈ కార్యక్రమంలో చిరాగ్‌పల్లి ఎస్ఐ వినయ్‌కుమార్, గోవింద్‌పూర్ మాజీ సర్పంచ్ తాజుద్దీన్ రాజు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పిల్లల అభివృద్ధికి అంగన్వాడి కేంద్రాలు




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జులై 07** ములుగు పిల్లలలో సమగ్రాభివృద్ధి జరగాలంటే అంగన్వాడీ పాఠశాలకు పంపించాలని రాయినిగూడెం సర్పంచ్ ఈసా సునీత తెలిపారు. గ్రామంలో ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అంగన్వాడీ కేంద్రంలో జరిగిన పాఠశాల సంసిద్ధతా మేళా కార్యక్రమంలో ఆమె పాల్గొని గ్రామంలోని 3 నుండి 5 సంవత్సరాల చిన్నారులను అందరు అంగన్వాడీకి పంపించాలన్నారు. వారికి ఆట, పాటలతో చదువు నేర్పిస్తారని మంచి పుష్టికరమైన ఆహారం కూడ అందేస్తారని తెలిపారు. పిల్లలకు ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కార్యక్రమంలో జంగాలపల్లి సెక్టార్ సూపర్ వైజర్ రమాదేవి మాట్లాడుతూ పిల్లలతో పాటు తల్లులు, గర్భిణులకు కూడ అంగన్వాడీ కేంద్రాలలో పుష్టికరమైన పౌష్టికాహారం అందుతుందని, శారీరక, భాషా, బుద్ధి వికాసం మరియు పూర్వ గణితాభివృద్ధికి సంబంధించిన వికాసం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వంతోపాటు ప్రథం స్వచ్ఛంద సంస్థ వారు కూడ పిల్లలకు యూనిఫామ్స్, బుక్స్, ఆట వస్తువులు అందిస్తున్నారని తెలిపారు.

పిల్లలకు సరైన విజ్ఞానంతోపాటు అన్ని రకాల అభివృద్ధి వికాసాలు, ఆట, పాటల ద్వారా విద్య అందాలంటే అంగన్వాడీకి పంపాలని ప్రథం మాస్టర్ ట్రైనర్ నాగేశ్వర రావు కార్యక్రమానికి విచ్చేసిన తల్లులకు సూచించారు. అంగన్వాడీ సంసిద్ధతా మేళాలో శారీరక, బుద్ధివికాస, భాషా వికాస మరియు పూర్వ గణితా వికాసాలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేసి పిల్లలతో కృత్యాలు చేయించినారు. వారి అభివృద్ధిలను లెక్కించడానికి ఇలాంటి కృత్యాలు తోడ్పడుతాయన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఈసా సునీత, సూపర్ వైజర్ రమాదేవి, స్కూల్ హెడ్ మాస్టర్ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి, ప్రథం మాస్టర్ ట్రైనర్ నాగేశ్వర రావు, అంగన్వాడీ టీచర్లు, తల్లులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# యువత నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి - రావుల శశాంక్

## శిక్షణలో పాల్గొన్న యువకులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న అధికారులు




హైదరాబాద్ : యువత నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలని మేరా యువ భారత్ హైదరాబాద్ జిల్లా అధికారి రావుల శశాంక్ తెలిపారు. మంగళవారం మేరా యువ భారత్, పర్యావరణ పరిరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో పలు యువ మండలీలకు వివిధ అంశాల పట్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిరక్షణ సేవా సమితి అధ్యక్షులు జి నరేష్, గురుచరణ్ తదితరులు పాల్గొన్నారు.

# 32వ ఉర్సు ముబారక్ మహోత్సవాలు

మైలవరం గొల్లపూడి రాయనపాడు వర్క్ షాప్ రోడ్డు నల్లగుంట సెంటర్లో వేంచేసి ఉన్న హజరత్ సయ్యద్ మజీలీ బాబా రహమతుల్లా అలైహి ఔలియా మహాత్ముల వారి 32వ ఉరుసు మహోత్సవాలు 8 తేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్లు దర్గా ముతవల్లి ఏపీ స్టేట్ బోర్డ్ డైరెక్టర్ షేక్ ఖాజా, జాయింట్ మతవల్లి షేక్ ముస్తఫా తెలిపారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు మజీలీ బాబా దర్గా నుండి గంధం ఊరేగింపు గొల్లపూడి మౌలా నగర్ మీదగా తిరిగి బాబా వారి దర్గాకు చేరుకుంటుందని తెలిపారు. 9వ తేదీన సాయంత్రం దీపారాధన ఫాతిహా కానీ ప్రసాదములు అందించనున్నట్లు తెలిపారు. ఈ మహోత్తరమైన కార్యక్రమంలో కులమతాలకతీతంగా భక్తులు పాల్గొని బాబా వారి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు. భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని బాబా వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

# గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడమే

## రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

### గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ను సమర్థంగా అమలు చేయాలి

### రేపటి నుంచి జిల్లాల్లో సర్పంచులు, కార్యదర్శులు, అధికారులకు మూడు రోజుల సమగ్ర శిక్షణ

### మంత్రి దనసరి అనసూయ సీతక్క

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జులై 07 ములుగు** మంగళవారం, హైదరాబాదు నుంచి గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అమలు, 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, గ్రామస్థాయి అభివృద్ధి కార్యక్రమాలపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్ని జిల్లాల కలెక్టర్లు,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ల లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.




ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ములుగు జిల్లా నుంచి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు ప్రజల అవసరాలకు అనుగుణంగా రూపొందించాలని సూచించారు. ప్రతి గ్రామం తన అవసరాలను స్వయంగా గుర్తించి, దీర్ఘకాలిక అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసేలా అధికారుల చూడాలన్నారు.

గ్రామస్థాయిలో ఖర్చు చేసే ప్రతి రూపాయి ప్రజల ప్రయోజనాల కోసమే వినియోగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా నిధులు ఖర్చు చేయరాదని స్పష్టం చేశారు. నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని ఆదేశించారు. 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ప్రతి సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శికి పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని సూచించారు. నిధుల వినియోగ మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ అభివృద్ధి పనులు చేపట్టాలని, గ్రామాల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతలు నిర్ణయించాలన్నారు.

రేపటి నుంచి జిల్లాల వారీగా మూడు రోజుల పాటు సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులకు సమగ్ర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి తెలిపారు. ఈ శిక్షణలో గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, గ్రామ పాలన, ఆర్థిక నిర్వహణ, చట్టపరమైన అంశాలపై విస్తృతంగా శిక్షణ అందించాలని చెప్పారు.

విబిజి రామ్-జి చట్టంపై ప్రతి సర్పంచ్, కార్యదర్శికి పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని, గ్రామస్థాయిలో చట్టబద్ధమైన పరిపాలనకు ఇది ఎంతో అవసరమని పేర్కొన్నారు.

శిక్షణ కార్యక్రమాలకు సంబంధిత అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు విధిగా హాజరు కావాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు.

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని, నీటి కొరత ఇతర సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

గ్రామీణాభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డిపిఓ వెంకయ్య, మిషన్ భగీరథ ఎస్ ఈ చల్మారెడ్డి , మిషన్ భగీరథ ఈఈ సురేందర్, పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్, మిషన్ భగీరథ డి ఈ సునీత , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు సేఫ్టీ అవగాహన కేంద్రాన్ని ప్రారంభించిన డీజీపీ సివి.ఆనంద్...

### వాహనదారులకు, ట్రాఫిక్ పోలీసులకు హెల్మెంట్ల పంపిణీ.. కమ్యూనిటీ పోలిసింగ్ సీసీ కెమెరాలను వర్చువల్ గా ప్రారంభం...

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై07 ప్రజాబలం:** ప్రజలలో, విద్యార్థులు, వాహనదారులలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచడానికి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన 'రోడ్డు సేఫ్టీ అవగాహన కేంద్రాన్ని' తెలంగాణ రాష్ట్ర డీజీపీ సివి. ఆనంద్ ప్రారంభించారు. వీటి ద్వారా ప్రాక్టికల్ డెమోలు, సైన్ బోర్డుల గుర్తింపు తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను








వివరించి, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వివరిస్తూ. పలువురు వాహనదారులకు, ట్రాఫిక్ పోలీసులకు హెల్మెట్లు పంపిణీ చేశారు.

వనమహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో పోలీసుల భాగస్వామ్యం ఉండాలని పిలుపునిచ్చారు.

అనంతరం కమ్యూనిటీ పోలిసింగ్ లో భాగంగా నేలకొండపల్లి మండల ప్రజలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకున్న 253 సిసి కెమెరాలను పోలీస్ కమిషనర్ కార్యాలయం నుండి వర్చువల్ గా డీజీపీ ప్రారభించారు. గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటులో సహకరించిన ప్రజలను ప్రత్యేకంగా అభినందించారు.

కార్యక్రమంలో ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

## బి ఆర్ ఎస్ పార్టీ ఊకదంపుడు ప్రచారం -- పరువు తీసుకుంటున్నారు అంటున్న మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు చేల వినయ్ కుమార్



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 07**బిములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ నుంచి ఎవరూ బి ఆర్ ఎస్ పార్టీలో చేరలేదని స్పష్టం చేశారు
బిబి ఆర్ ఎస్ నాయకులు కాంగ్రెస్ నుంచి పెద్ద ఎత్తున నాయకులు తమ పార్టీలో చేరినట్లు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ఆయన పేర్కొన్నారు. బి ఆర్ ఎస్ కండువా కప్పుకున్న వ్యక్తి పేరు తిరుపతి రెడ్డి కాదని, అతని అసలు పేరు సంపత్ రెడ్డి అని తెలిపారు.
బిసంపత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాదని, సాధారణ పౌరుడిగా వివిధ పనుల నిమిత్తం అప్పుడప్పుడు కాంగ్రెస్ నాయకులను కలిసేవాడని చెప్పారు. ఆయన ఒక్కరే బి ఆర్ ఎస్ కండువా కప్పుకున్నారని, కాంగ్రెస్ పార్టీకి చెందిన మరెవ్వరూ బి ఆర్ ఎస్ లో చేరలేదని స్పష్టం చేశారు.
బిబి ఆర్ ఎస్  నాయకులు కాంగ్రెస్ నుంచి పలువురు చేరినట్లు గొప్పలు చెప్పుకోవడం, ఊకదంపుడు ప్రచారం చేయడం, జబ్బలు సరిచేసుకోవడం తప్ప మరేమీ కాదని ఎద్దేవా చేశారు. విడుదల చేసిన ఫోటోల్లో కూడా టిఆర్ఎస్ పార్టీకి చెందిన వారే కనిపిస్తున్నారని, కొత్తగా చేరిన వ్యక్తి సంపత్ రెడ్డి తప్ప మరెవరూ లేరని అన్నారు.
బిలేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లు చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం బి ఆర్ఎస్ నాయకులు చేస్తున్నారని చిటమట రఘు విమర్శించారు.
ఇలాంటి అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మబోరని, వాస్తవాలను గుర్తించి తగిన సమాధానం ఇస్తారని ఆయన అన్నారు.
ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామ నాయకులు, సీనియర్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

## రావులపల్లి లో జనగణన  పై అవగాహన కల్పిస్తున్న గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జూలై7 (ప్రజా బలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం రావులపల్లి గ్రామంలో జన గణన పైగ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ పాలక వర్గ సభ్యులకు గ్రామ పెద్దలకు అవగాహన కల్పిస్తున్న గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, ఒకే దగ్గర ఓటు హక్కు వినియోగించుకోవాలి అలా వినియోగించుకోవడం వల్ల రైతుబంధు కానివ్వండి సంక్షేమ పథకాలు కానీయండి ప్రభుత్వం నుండి వచ్చే నిధులు కానీయండి అన్ని క్రమముగా వస్తాయి కాబట్టి ఒకే దగ్గర జనగణన నమోదు చేయించుకోవాలి మన గ్రామం జిల్లాలోని నెంబర్ వన్ గా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్న గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు

## బొగత జలపాతాన్ని ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

### ఇందిరా మహిళా శక్తి ఫుడ్ కోర్ట్ ద్వారా స్థానిక సాంప్రదాయ వంటకాలను పర్యాటకులకు అందుబాటులో ఉంచాలి :: జిల్లా కలెక్టర్ బోర్థడే హేమంత్ సహదేవరావు

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జులై 07 కలెక్టరేట్**మంగళవారం జిల్లా బోర్థడే హేమంత్ సహదేవరావు తన ఛాంబర్ లో వాజేడు మండలంలోని బొగత జలపాతం అభివృద్ధి,



పర్యాటకులకు కల్పించాల్సిన సౌకర్యాలు, ఇందిరా మహిళా శక్తి ఫుడ్ కోర్ట్ నిర్వహణ, స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యం తదితర అంశాలపై సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బొగత జలపాతాన్ని సందర్శించే పర్యాటకులకు ఆహ్లాదకరమైన అనుభూతిని కల్పించేలా పరిసరాలను పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. తాగునీరు, పారిశుధ్యం, పార్కింగ్, విశ్రాంతి సౌకర్యాలు, భద్రత, దిశా నిర్దేశక బోర్డులు తదితర అన్ని మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.
పర్యాటకులకు స్థానిక సంస్కృతి, సంప్రదాయ ఆహార రుచులను పరిచయం చేసేలా ఇందిరా మహిళా శక్తి ఫుడ్ కోర్ట్ ద్వారా జొన్న రొట్టె, బాంబూ చికెన్, నాటుకోడి, చేపల వంటకాలు, తదితర సాంప్రదాయ వంటకాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. స్థానిక మహిళా స్వయం సహాయక సంఘాలకు కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధితో పాటు ఆదాయాన్ని పెంచుకోవాలని అన్నారు.
పర్యాటక ప్రాంతంలో స్థానిక ప్రత్యేకతను ప్రతిబింబించే ఆహార పదార్థాలకు ప్రాధాన్యం కల్పిస్తూ, వచ్చే ప్రతి పర్యాటకుడికి నాణ్యమైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుని బొగత జలపాతాన్ని రాష్ట్ర స్థాయిలో ఆదర్శ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, డి ఎఫ్ ఓ వికాస్ మీనా, టూరిజం అధికారి శివాజీ, అడిషనల్ డి ఆర్ డి ఓ శ్రీనివాస్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ముందే పెళ్లి చేసుకున్న సియా

ముంబై, జూలై 7 పుణేలోని లోహగడ్ కోటపై జరిగిన హత్య కేసులో రోజుకో సంచలన విషయం వెలుగులోకి వస్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న సియా గోయల్ (20), తన బాయ్‌ఫ్రెండ్ చేతన్ చౌదరిని అప్పటికే రహస్యంగా వివాహం చేసుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో కీలక సమాచారం బయటపడింది. పుణేకు చెందిన రియల్టర్ కేతన్ అగర్వాల్‌తో (25) ఆమెకు నిశ్చితార్థం జరిగిన తర్వాత ఈ వివాహం జరగడం గమనార్హం.పోలీసు వర్గాల కథనం ప్రకారం.. సుమారు నాలుగు నెలల క్రితం సియా, చేతన్ ఒక స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రత్యేక వివాహ చట్టం కింద పెళ్లి చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ వివాహానికి సియా కాలేజీ స్నేహితులు ఇద్దరు సాక్షులుగా సంతకాలు చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వారిని కూడా విచారించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ రహస్య వివాహాన్ని నిర్ధారించుకునేందుకు పోలీసులు మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం గాలిస్తున్నారు.ఈ జంట పెళ్లి దండలతో ఉన్న కొన్ని ఫొటోలను ఒక ప్రైవేట్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి డిలీట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆ ఫొటోలను తిరిగి పొందేందుకు టెక్నికల్ బృందాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.

# చెట్ల పెంపకం పేరుతో అడవికే నిప్పు..?

### టీజీఎఫ్‌డీసీ సత్తుపల్లి డివిజన్‌లో కలప వ్యర్థాల దహనంపై ఆరోపణలు

### విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం: డివిజన్ మేనేజర్

**సత్తుపల్లి ప్రతినిధి జూలై07 ప్రజాబలం:**చెట్ల పెంపకం,పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో నిర్వహించాల్సిన ప్లాంటేషన్ పనులే ఇప్పుడు వివాదానికి కేంద్రబిందువుగా మారాయి. తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్









(టీజీఎఫ్‌డీసీ) సత్తుపల్లి డివిజన్ పరిధిలోని కొన్ని ప్లాంటేషన్ ప్రాంతాల్లో కలప వ్యర్థాలను అక్కడికక్కడే తగులబెడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.
స్థానికులు, ప్రకృతి ప్రేమికుల కథనం ప్రకారం, ప్లాంటేషన్‌లో కోసిన కలపను విక్రయించిన అనంతరం మిగిలిపోయిన మారుజాతి చెట్లు, కొమ్మలు, ఇతర కలప వ్యర్థాలను నిబంధనల ప్రకారం సేకరించి వేరే ప్రదేశానికి తరలించి నిర్వీర్యం చేయాల్సి ఉండగా, వాటిని ప్లాంటేషన్‌లోనే దహనం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ మంటల వల్ల ఉత్పత్తి అవుతున్న వేడి, పొగ కారణంగా సమీపంలోని ఇతర వృక్షాలు దెబ్బతింటున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
ఈ అంశంపై సత్తుపల్లి డివిజన్ మేనేజర్‌ను వివరణ కోరగా, నిబంధనలకు విరుద్ధంగా కలప వ్యర్థాలను ప్లాంటేషన్ ప్రాంతంలో తగులబెట్టేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఒకవేళ అలాంటి ఘటన జరిగినట్లు విచారణలో తేలితే సంబంధిత కాంట్రాక్టర్‌పై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.
అయితే, మంటలు అధికారుల కార్యాలయానికి సమీపంలోనే కనిపిస్తున్నప్పటికీ సంబంధిత ప్లాంటేషన్ అధికారులు స్పందించడం లేదని, కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యర్థాలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అయ్యే ఖర్చును తప్పించుకోవడానికే వాటిని అక్కడికక్కడే దహనం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.
ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం, టీజీఎఫ్‌డీసీ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలని, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రకృతి ప్రేమికులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణకు ఫుడ్ సేఫ్టీ శాఖ కట్టుబడి ఉంది. ఫుడ్ సేఫ్టీ అధికారి శరత్



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై 07 ప్రజాబలం:**వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణకు ఫుడ్ సేఫ్టీ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఇన్‌చార్జి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఈ,శరత్ తెలిపారు.
ఖమ్మం నగరంలోని పిస్తా హౌస్ రెస్టారెంట్‌లో భోజనం చేసిన అనంతరం తన కుమార్తె అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఒక వినియోగదారుడు చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం సంబంధిత రెస్టారెంట్ లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహార పదార్థాల నాణ్యత,



పరిశుభ్రత, నిల్వ విధానాలు, వంటశాల నిర్వహణ, ఆహార భద్రత ప్రమాణాల అమలును క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీలలో భాగంగా రెండు ఆహార పదార్థాల చట్టబద్ధ నమూనాలను సేకరించి, విశ్లేషణ నిమిత్తం రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపించారు.
ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఫుడ్ సేఫ్టీ అధికారి ఈ. శరత్ మాట్లాడుతూ, ప్రయోగశాల నివేదికలు అందిన అనంతరం వాటిలో తేలిన ఫలితాల ఆధారంగా ఆహార భద్రత ప్రమాణాల చట్టం ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ షాపులు, ఇతర ఆహార వ్యాపార సంస్థలపై ఫుడ్ సేఫ్టీ శాఖ నిరంతరం తనిఖీలు నిర్వహిస్తోందని తెలిపారు. ఆహార వ్యాపార నిర్వాహకులు పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారాన్ని తయారు చేసి విక్రయించడంతో పాటు, నాణ్యమైన ముడి పదార్థాలను మాత్రమే వినియోగించాలని, ఆహార భద్రత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.
వినియోగదారులు ఆహారం తీసుకునే సమయంలో పరిశుభ్రత, నాణ్యత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నాసిరకం, కలుషితమైన లేదా గడువు ముగిసిన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లయితే వెంటనే ఫుడ్ సేఫ్టీ శాఖ దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజారోగ్య పరిరక్షణకు ఎటువంటి రాజీ లేకుండా ఫుడ్ సేఫ్టీ శాఖ చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.
ఈ తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిపిడివో ప్రోగ్రాంలో భాగంగా ఎంపీపీ ఎస్ పాఠశాలను తనిఖీ చేసిన సర్పంచ్




**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 07**ములుగు జిల్లా ఏటూరు నాగారం మండల కేంద్రంలోని ముల్లకట్ట గ్రామ పంచాయతీలో మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల ను తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్న సర్పంచ్ ఈసం జనార్ధన్ అలాగే పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి మంచి ప్రయోజకులను చేయాలని సర్పంచ్ అన్నారు పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకొని రావాలని కోరారు

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కె ఇంద్ర హెడ్మాస్టర్ రాకేష్ కార్యదర్శి ఎం. నారాయణ తదితరులు పాల్గొన్నారు

## ఎలాంటి పరిస్థితుల్లోనూ రాష్ట్రంలో తాగునీటి సమస్య తలెత్తనివ్వం- మంత్రి సీతక్క



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జులై 07 ములుగు** వర్షాలు ఆలస్యమైనా.. ఎల్‌నినో ప్రభావం ఉన్నా ముందస్తు కార్యాచరణతో ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరాజలాశయాల నీటి నిల్వలపై రోజువారీ పర్యవేక్షణ.. అవసరమైతే ప్రత్యామ్నాయ నీటి వనరుల వినియోగానికి ఆదేశాలు

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క అధ్యక్షతన తెలంగాణ డ్రింకింగ్ వాటర్ సప్లయ్ కార్పొరేషన్ బోర్డు సమావేశం సోమవారం తెలంగాణ సచివాలయంలో జరిగింది. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి సరఫరా పరిస్థితి, జలాశయాల్లో నీటి నిల్వలు, రాబోయే నెలల్లో తాగునీటి అవసరాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ, ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. వర్షాలు ఆలస్యమైనా, వర్షపాతం తగ్గినా, ఎల్‌నినో ప్రభావం ఉన్నా రాష్ట్రంలో ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అధికారులు పనిచేయాలని ఆదేశించారు.

రాష్ట్రంలోని గ్రామీణ జనావాసాలకు ప్రధానంగా కృష్ణా, గోదావరి బేసిన్‌ల ఉపరితల జల వనరుల నుంచి శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు సమావేశంలో వివరించారు. తాగునీటి కోసం వినియోగిస్తున్న 29 జలాశయాల నుంచి 123 నీటి శుద్ధి కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాలకు నీరు సరఫరా అవుతున్న నేపథ్యంలో, ప్రతి జలాశయంలో 45 రోజులు, 90 రోజులు, 180 రోజుల అవసరాలకు అనుగుణంగా నీటి లభ్యతపై మంత్రి సమీక్షించారు.

అన్ని జలాశయాల్లో నీటి మట్టాలను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ ఇరిగేషన్ శాఖ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని మంత్రి ఆదేశించారు. తాగునీటి అవసరాలకు సరిపడా నీటి నిల్వలను ప్రతి జలాశయంలో ముందుగానే నిర్ధారించాలని సూచించారు.

జూలై నెలాఖరు వరకు తగిన నీటి ప్రవాహం లేకపోతే అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఉదయసముద్రానికి, తుపాకులగూడెం బ్యారేజ్ నుంచి దుమ్ముగూడెంకు నీటిని విడుదల చేసేలా ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

ప్రస్తుతం సింగూర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు తక్కువగా ఉన్న నేపథ్యంలో, రాబోయే 45 రోజుల్లో సింగూర్‌లోకి తగిన నీటి ప్రవాహం రాకపోతే సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి (పాక్షికంగా), నిజామాబాద్ (పాక్షికంగా) జిల్లాల్లోని గ్రామీణ జనావాసాలు, పట్టణ ఆధారిత నివాస ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి, ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాల ఆధారిత తాగునీటి పథకాలను వినియోగించేలా తక్షణమే సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

అలాగే రాష్ట్రంలోని అన్ని నివాస ప్రాంతాలకు స్థానిక మంచి నీటి వనరులను వినియోగిస్తూ ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరా వ్యవస్థను సిద్ధంగా ఉంచాలని సూచించారు. స్థానిక నీటి వనరులు అందుబాటులో లేని ప్రాంతాల్లో బోర్‌వెల్‌లను లోతుగా తవ్వడం, ఫ్లషింగ్ చేయడం, అవసరమైతే బోర్‌వెల్‌లను అద్దెకు తీసుకోవడం వంటి చర్యలకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

ఎల్‌నినో ప్రభావం లేదా ఇతర వాతావరణ పరిస్థితుల కారణంగా ఎలాంటి తాగునీటి సంక్షోభం తలెత్తకుండా ప్రభుత్వం పూర్తిస్థాయి అప్రమత్తతతో పనిచేస్తోందని మంత్రి తెలిపారు. ప్రతి గ్రామం, ప్రతి నివాస ప్రాంతానికి నిరంతరాయంగా సురక్షితమైన తాగునీరు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేసి ముందస్తు చర్యలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, మిషన్ భగీరథ ఇంజనీర్-ఇన్-చీఫ్ కృపాకర్ రెడ్డి, ఇతర చీఫ్ ఇంజనీర్లు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

## జమ్మికుంట మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్ పి. హరిప్రసాద్





**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జూలై 7**జమ్మికుంట మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్ పి. హరిప్రసాద్ కు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి మర్యాదపూర్వకంగా శాలువాతో సన్మానం చేసి స్వాగతం పలికారు. అనంతరం వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ట్రైనీ కలెక్టర్‌ను ఆహ్వానించి, మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, మేనేజర్ జి.రాజిరెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సిబ్బందికి బదిలీ, పదోన్నతి ఉత్తర్వుల అందజేత,



**సత్తుపల్లి ప్రతినిధి జూలై 7 ప్రజాబలం:** సత్తుపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం సత్తుపల్లి మండలం, సత్తుపల్లి పట్టణ పరిధిలో బదిలీలు, పదోన్నతులు పొందిన అంగన్వాడీ టీచర్లు, అంగన్వాడీ ఆయాలకు ఉత్తర్వుల ప్రతులను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, సీడీపీఓ సత్యవతి పాల్గొన్నారు. పదోన్నతులు, బదిలీలు పొందిన సిబ్బందికి వారు అభినందనలు తెలియజేస్తూ, కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో అంగన్వాడీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రైతులకు వ్యవసాయ శాఖ విజ్ఞప్తి

## ఫారం పాండ్ల నిర్మాణంతో వర్షపు నీటిని ఒడిసిపట్టి పంటలను కాపాడుకోండి



**సత్తుపల్లి, జూలై 7 ప్రజాబలం:** వర్షపు నీటిని సమర్థవంతంగా వినియోగించుకుని నీటి కొరతను అధిగమించేందుకు రైతులు తమ వ్యవసాయ భూముల్లో ఫారం పాండ్లు (నీటి కుంటలు) నిర్మించుకోవాలని మండల వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేసింది.

వ్యవసాయ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, ఫారం పాండ్ల ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకుని అవసరమైన సమయంలో పంటలకు రక్షక నీటిపారుదల అందించవచ్చు. దీంతో పంట దిగుబడులు పెరగడంతో పాటు ఎండకాలంలో పంట నష్టాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని పేర్కొంది. అలాగే భూగర్భ జలాల మట్టం పెరగడానికి, చేపల పెంపకం వంటి అనుబంధ వ్యవసాయ కార్యకలాపాలకు కూడా ఫారం పాండ్లు ఉపయోగపడతాయని వెల్లడించింది.

ఈ పథకం కింద 15ఐ15ఐ3 మీటర్లు, 20ఐ20ఐ3 మీటర్లు, 25ఐ25ఐ3 మీటర్ల పరిమాణాల్లో నీటి కుంటలను పూర్తి రాయితీతో నిర్మించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపింది.

ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి, ఒక ఎకరం నుంచి ఐదు ఎకరాల వరకు వ్యవసాయ భూమి ఉన్న రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హులని స్పష్టం చేసింది.

ఫారం పాండ్ నిర్మించుకోవడానికి ఆసక్తి ఉన్న రైతులు తమ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) లేదా మండల వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకుని దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఇంచార్జి) డి.ఎస్.కె. శ్రీనివాసరావు కోరారు.

## అందమైన నగరంగా తీర్చిదిద్దడంలో అందరూ భాగస్వాములు కావాలి : మేయర్ మహంకాళి స్వామి



**పెద్దపల్లి/గోదావరిఖని, జూలై-7, ప్రజాబలం ప్రతినిధి :** అందమైన నగరంగా తీర్చిదిద్దడంలో అందరూ భాగస్వాములు కావాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి పిలుపునిచ్చారు. వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా మంగళ వారం ఉదయ్ నగర్ పవర్ హౌజ్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ కంకణాల మౌనిక తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా తీర్చే క్రమంలో గత ఐదు నెలలుగా డ్రైనేజ్ లలో పూడిక తీత కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతున్నదని అన్నారు. నగర పాలక సంస్థ ఆద్వర్యంలో ఒక ప్రక్క కాలువలలో పూడిక పూడిక తీత కార్యక్రమం చేపడుతుంటే మరో ప్రక్క అదే కాలువల్లో చెత్త వేస్తుండడంతో యధావిధిగా తయారవుతున్నదని అన్నారు. చెత్త వేయవద్దని ఇన్నాళ్ళూ అవగాహన కల్పించామని ఇక జరిమానాలు విధించక తప్పదని అన్నారు.



కేవలం రూ 50/- చెల్లిస్తే నెల రోజుల పాటు ఇంటి ముందుకే వచ్చి చెత్త తీసుకెళ్ళే అవకాశం ఉండగా రోడ్లపై నాలాల్లో వేయడం సరికాదని అన్నారు. స్వచ్ఛ రామగుండంగా తీర్చిదిద్దే కార్యక్రమంలో పాలు పంచుకోవాలని అన్నారు . గత కొన్ని సంవత్సరాలుగా ఎవరూ పట్టించుకోక పోవడంతో బొందల గడ్డ గా మారిన నగరాన్ని నవ నిర్మాణం చేస్తూ రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తున్న ఎంఎల్ఏ రాజ్ ఠాకూర్ కు సహకరించాలని అన్నారు. గంగానగర్ ఫ్లై ఓవర్ ప్రక్కన సర్వీస్ రోడ్డు వెంబడి వెలసిన అక్రమ కట్టడాలతో రహదారి ఇరుకుగా మారి అనేక ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి వాటిని తొలగించడం జరిగిందని అన్నారు. రోడ్డు కు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు కూడా తొలగించడం జరిగిందని అన్నారు. రోడ్డు మీద ఉన్న విద్యుత్ స్తంభాలు కూడా వెనక్కి తరలించవల్సిందిగా ఎన్ పి డి సి ఎల్ అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని అన్నారు. పదేళ్లుగా పట్టించుకోని నాలాలో యంత్రాల సహాయంతో పూడిక తొలగించి శుభ్రం చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిఇ ఇ శ్రీకాంత్, ఎఇ తేజస్విని, టిపిఎస్ నవీన్ , సానిటరీ ఇన్స్పెక్టర్ నాగ భూషణం, జూనియర్ అసిస్టెంట్ చంద్రా రెడ్డి, ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్, సానిటరీ జవాన్ సోమేష్, వాటర్ సప్లయ్ సూపర్వైజర్ శశికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కరిస్తాం

మైలవరం జులై 7 ప్రజా సమస్యల పరిష్కరించడానికి కృషి చేస్తామని ఎన్సిపి పార్టీ ఎన్టీఆర్ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షురాలు పఠాన్ మున్ని పేర్కొన్నారు. మండలంలోని మైలవరం గ్రామం బాబా నగర్ లో ఎన్సీపీ పార్టీ మండల నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మున్ని మాట్లాడుతూ ఎన్సిపి పార్టీ ఎన్డీఏ ఎన్వైసీ మహా కూటమి తెలంగాణ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ఒరిస్సా ఇన్చార్జి డాక్టర్ మద్దిశెట్టి శామ్యూల్ ఆదేశాల మేరకు ఈ నూతన కమిటీ ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల ఎన్సీపీ పార్టీ అధ్యక్షురాలుగా నక్క వాణి ను నూతనంగా ఎన్నుకున్నామన్నారు. మండలంలో ఉన్న ప్రజా సమస్యల తమ దృష్టికి తీసుకువస్తే అధికారులకు తెలియజేసి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇండ్ల స్థలాల సమస్య పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా వీటితోపాటు ఇంకా పలు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# మద్యం ప్రియులను నిలువునా దోచేస్తున్న సత్తుపల్లి సిండికేట్.

## వైన్స్ షాపులో స్టాక్ నిల్....బెల్ట్ షాపులో స్టాక్ ఫుల్...

### నేనే రాజు నేనే మంత్రిల సిండికేట్ వ్యవహారం

### రోజుకు లక్షల్లో అధిక వసూళ్లు

### ఎక్సైజ్ శాఖ మౌనవ్రతం






**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై07 ప్రజాబలం:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి మద్యం సిండికేట్ వ్యవహారం పుష్ప సినిమాలోని ఎర్రచందనం సిండికేట్ ను మించేలా ఉంది.. సత్తుపల్లి మండల వైన్ షాపుల నిర్వాహకులు సిండికేట్ల ఏర్పడి మద్యం ప్రియులను నిలువునా దోచేస్తున్నారు. రోజంతా కష్టపడి సాయంత్రం సమయానికి కొంచెం మద్యం సేవించి ఇంటికి వెళ్లే శ్రామికుల పాలిట సిండికేట్ వ్యవహారం శాపంలా మారింది. రోజువారి వచ్చిన కూలీలలో సగం వైన్ షాప్ నిర్వాహకులు సిండికేట్ల రూపంలో లాగేస్తున్నారు. వైన్ షాపులో ఉంచాల్సిన నిలువలు అధిక ధరలకు బెల్ట్ షాపుకు తరలిస్తూ వైన్ షాపులకు వద్దకు వచ్చిన మద్యం ప్రియులకు నో స్టాక్ అని సమాధానం ఇస్తూ బెల్ట్ షాపులలో దొరుకుతుంది అని సమాధానం ఇస్తున్నారు అంటే సిండికేట్ వ్యవహార ఎంతలా నిర్వహిస్తున్నారు అర్థమవుతుంది.వైన్స్ షాప్ కౌంటర్ లో అమ్మితే ఎమ్మార్పీ దొరకే అమ్మాల్సి వస్తుంది కానీ బెల్ట్ షాపు వాళ్లకు కోటర్ బాటిల్ మీద 25 రూపాయలు అధిక ధరకు విక్రయిస్తున్నారు.

ఇంత తంతు జరుగుతున్న ఎక్స్చేంజ్ అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారు దీని వెనుక ఉన్న తాత్పర్యం ఏమిటి.. హైకోర్టు సైతం బెల్ట్ షాపు వల్ల ప్రజలకు నష్టం ఉంది అని పలుమార్లు హెచ్చరించిన నిర్వాహకులు మాత్రం తగ్గేదేలా వ్యవహరిస్తున్నారు. సత్తుపల్లి సెంటర్లో ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేసి లావాదేవీలు మొత్తం అక్కడ నుంచి నడిపిస్తున్నారని సమాచారం.

సత్తుపల్లి మండల పరిధిలో సుమారు 1000 వరకు బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. ఒక్కో బెల్ట్ షాప్ రోజుకు సగటున 50 బాటిల్స్ వరకు విక్రయిస్తున్నారు. 1000 బెల్ట్ షాపులలో రోజుకు 50 వేల వరకు బాటిల్స్ 25 రూపాయల అధిక ధరకు సిండికేట్ లో విక్రయిస్తుంటే సిండికేట్కు ఒక్కరోజులో అదనంగా 1 లక్ష 25 వేల రూపాయలు అధికంగా వసూలు చేస్తున్నారు. ఇలా సుమారు నెలకి 37లక్షల 50 వేలు వరకు అదనంగా సిండికేట్ రూపంలో పొందుతున్నారు.

ఒక బాటిల్ మద్యం వైన్స్ షాప్ లో190 రూపాయలు ఉంటే బెల్ట్ షాపులో మద్యం సేవించాలి అంటే 250 రూపాయలు చెల్లించాల్సి వస్తుంది.

ఇలా వేంసూర్, కల్లూరు, పెనుబల్లి మండలాలలో నెలకి కోట్లలలో సిండికేట్ వ్యవహారం నిర్వహిస్తున్నారు. కొన్ని మండలాలలో సిండికేట్ నిర్వహికులు బెల్ట్ షాపులు వద్దకే మద్యం తరలిస్తున్నారు. సిండికేట్ బెల్ట్ షాప్ నిర్వహించారు,మద్యం ప్రియులను నిలువునా దోచేస్తూ పబ్బం గడుపుతున్నారు.

వైన్స్ షాప్ లో దొరకాల్సిన బీర్లు కూడా కౌంటర్ లో దొరకవు,బెల్ట్ షాప్ లో అన్ని రకాల బీర్లు దొరకటం విశేషం.. ఇంత వ్యవహారం జరుగుతున్న సంబంధిత అధికారులు మద్యం ప్రియులకు చట్టాలకు న్యాయం చేస్తారా లేదా అని వేచి చూడాల్సిందే.

# గురుకులాలు, హాస్టళ్లలో క్లీన్ అండ్ గ్రీన్ కు ప్రాధాన్యం,మెనూ అమలులో రాజీ ఉండొద్దు

### బీసీ స్టడీ సర్కిల్స్ బలోపేతానికి ప్రత్యేక కమిటీ

### జూలై 16 నుంచి కులవృత్తుల మేళా.. అన్ని కులాలకు అవకాశం

### స్కిల్ డెవలప్మెంట్‌తో బీసీలకు మరిన్ని ఉపాధి అవకాశాలు

### ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్స్‌పై అధ్యయనం చేయాలి

### బీసీ సంక్షేమ శాఖలో సంక్షేమం, నాణ్యత, ఉపాధి కల్పనకు ప్రాధాన్యత

### బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ 7 జూలై : గురుకులాలు, హాస్టళు ప్రారంభమై 20 రోజులు పూర్తైన నేపథ్యంలో గత సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై బీసీ సంక్షేమ శాఖకు సంబంధించిన కార్యక్రమాలపై సచివాలయంలో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గురుకులాలు, హాస్టళ్లు పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన క్లీన్ అండ్ గ్రీన్ వాతావరణంలో ఉండేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూను అన్ని గురుకులాలు, హాస్టళ్లలో తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు.

జిల్లా బీసీ సంక్షేమ అధికారులు (డీబీసీవోలు) క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు తరచూ గురుకులాలు, హాస్టళ్లను సందర్శించి విద్యార్థుల పరిస్థితులను స్వయంగా పరిశీలించాలని సూచించారు.స్టడీ సర్కిల్స్‌లో మరింత నాణ్యత పెంపొందించేందుకు, సివిల్స్‌తో పాటు వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఢిల్లీ, అహ్మదాబాద్ వంటి ఇతర రాష్ట్రాల్లో



విజయవంతంగా అమలవుతున్న స్టడీ సర్కిల్స్ విధానాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

జూలై 16 నుంచి హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న కులవృత్తుల మేళాలో అన్ని కులాల సంప్రదాయ వృత్తిదారులకు సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడే కుట్టు మిషన్ పథకం అమలు కోసం సమగ్ర విధి విధానాలను రూపొందించాలని ఆదేశించారు.బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టి ఉపాధి అవకాశాలను పెంచాలని, ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్స్‌పై సమగ్ర అధ్యయనం చేసి అమలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఐఐటీలు, ఐఐఎంలలో సీట్లు సాధించిన గురుకుల విద్యార్థులకు అందించే ల్యాప్‌టాప్‌ల పంపిణీపై సమగ్ర నివేదిక సమర్పించాలని మంత్రి ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ కమిషనర్, గురుకులాల కార్యదర్శి ఆకస్మికంగా గురుకులాలు, హాస్టళ్లను తనిఖీ చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన సౌకర్యాలు అందుతున్నాయో లేదో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కాటమయ్య రక్షణ కవచాల శిక్షణ పూర్తి చేసుకొని కిట్లు అందని జిల్లాల్లో వెంటనే పంపిణీ పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

ఈ సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయదేవి, గురుకులాల కార్యదర్శి సైదులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, మామిడి హరికృష్ణ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి సంస్థ కార్మికుల రక్షణ పరికరాల కొనుగోలులో జాప్యం

### ఉత్పత్తికి కార్మికుల రక్షణకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి - సీఐటీయూ నేత మెండె శ్రీనివాస్

**పెద్దపల్లి, జూలై-7, ప్రజాబలం ప్రతినిధి :** బొగ్గు ఉత్పత్తికి కార్మికుల రక్షణకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని సీఐటీయూ నేత మెండె శ్రీనివాస్ అన్నారు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అర్జివన్ బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో 1, 11 గనిలో పని పరిస్థితులు రక్షణ పనిముట్ల వివరాలను కార్మికులతో మాట్లాడి వారి సమస్యలకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మెండె శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ పూర్తిగా రాజకీయ జోక్యంతో కార్మికులు పనిచేయలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. కార్మికులు రక్తాన్ని చెమటగా మార్చి సంస్థ వేలాది కోట్ల రూపాయలు లాభాలు సాధిస్తున్నప్పటికీ కనీస కార్మికుల మౌలిక సమస్యలతో పాటు పని



చేసేందుకు రక్షణ పరికరాల జాప్యంతో చిన్న చిన్న ప్రమాదాల సంఖ్య పెరుగుతుందన్నారు. ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న కోల్ కట్టర్, గత ఆరు నెలల నుండి బొగ్గు ఉళ్లు కోసేందుకు బిట్లు రావడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని. టాబ్ లైన్ ఎక్స్చేంజ్ కీలలు రావడంలేదని లైన్మెన్ చెప్తున్న పరిస్థితి, ప్రతి డిస్మినేషన్ కార్మికుడు రక్షణ పనిముట్లు లేక ఇబ్బంది పడుతున్నారని తెలియజేశారు, గనిలో సరి అయిన గాలి నీరు లేక కార్మికులు అస్వస్థకు గురవుతున్నారని పని స్థలాలు మెరుగుపరచడంలో పూర్తిగా యజమాన్యం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఎస్.డి.ఎల్, ఎల్.హెచ్.డి సర్వీస్ పూర్తయిన వెహికల్స్ తో ఉత్పత్తి చేయవలసి వస్తుంది అని కనీసం వెహికల్స్ స్పేర్ పార్ట్స్ కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలియజేశారు. సింగరేణి సంస్థకు కోట్లాది రూపాయలు లాభాలు అర్ధిస్తున్నప్పటికీ, పాలక ప్రభుత్వాల విధానాలతో దివాలా తీసే పరిస్థితికి నెడుతున్నారన్నారు. సంస్థకు రావలసిన కరెంటు డబ్బులు బొగ్గు అమ్మిన డబ్బులు రూ" 56000 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం బకాయిలను చెల్లించకపోవడంతో సంస్థ అభివృద్ధికి కార్మికుల రక్షణ ఉత్పత్తికి ప్రమాదం ఏర్పడే పరిస్థితులు నెలకొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంస్థ పరిస్థితులను అర్థం చేసుకొని సింగరేణి యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బకాయిలు వసూలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్జీవన్ బ్రాంచ్ గౌరవాధ్యక్షులు ఆరెపల్లి రాజమౌళి, మెండె శ్రీనివాస్, పెద్దపల్లి శశికిరణ్, జంగపల్లి మల్లేష్, శ్రావణ్ కుమార్, నవీన్ కుమార్, ఇప్పలపల్లి సతీష్, శివ, పోలేటి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# నేరాలకు దూరంగా ఉండాలి

### రౌడీషీటర్లు, అనుమానితులకు చిరాగ్‌పల్లి పోలీసుల కౌన్సెలింగ్



**జహీరాబాద్, జూలై 7 ప్రజాబలం ప్రతినిధి:** చిరాగ్ పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, అనుమానితులు, బ్యాడ్ క్యారెక్టర్లకు మంగళవారం పోలీసులు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వినయ్‌కుమార్ మాట్లాడుతూ శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని, ఎలాంటి నేరాలకు పాల్పడకుండా చట్టాన్ని గౌరవిస్తూ సత్ప్రవర్తనతో జీవించాలని పోలీసులు సూచించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా పోలీసులకు సహకరించాలని, నేరాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతమైన పౌరులుగా మెలగాలని, మద్యం సేవించి గొడవలు, దాడులు, బెదిరింపులు, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడరాదని సూచించారు.పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటారని, ప్రశాంతతకు భంగం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# సిరియా పర్యటనలో ఉన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు

న్యూఢిల్ల, జూలై 7 సిరియా పర్యటనలో ఉన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌కు పెను ప్రమాదం తప్పింది. రాజధాని డమస్కస్‌లో ఆయన బస చేసిన హోటల్ సమీపంలో మంగళవారం వరుస పేలుళ్లు సంభవించడం తీవ్ర కలకలం రేపింది. అయితే, ఈ ఘటనలో మాక్రాన్ సురక్షితంగా ఉన్నారని, పేలుళ్ల తర్వాత కూడా ఆయన తన పర్యటనను యథావిధిగా కొనసాగించారని ఫ్రాన్స్ అధ్యక్ష భవనం (ఎలీసీ) ప్రకటించింది.రాయిటర్స్ కథనం ప్రకారం, డమస్కస్‌లోని మాక్రాన్ బస చేసిన హోటల్‌కు సమీపంలో ఈ బాంబు పేలుళ్లు జరిగాయి. ఈ ఘటనను సిరియా భద్రతా వర్గాలు ధ్రువీకరించాయి. పేలుళ్ల అనంతరం అధికారులు వెంటనే అప్రమత్తమై ఆ ప్రాంతానికి వెళ్లే రహదారులను మూసివేసి, భద్రతను కట్టుదిట్టం చేశారు. సంఘటనా స్థలం నుంచి పొగలు వస్తున్నట్లు రాయిటర్స్ ప్రతినిధి ఒకరు తెలిపారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com